శ్రీగురుశ్శరణం శ్రీ వేంకటేశాయ నమః

# శ్రీకృష్ణాలహరి

శ్రీ ప॥ ప॥ వాసుదేవానంద సరస్వతీ యతివిరచితము

స్వేచ్ఛాంధ్రానువాదము

శ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2016

# SRI KRISHNA LAHARI

*By*
**SRI VASUDEVANANDA SARASVATI**
**YATI VIRACHITAMU**

*Free Translation by*
**Sri Malladi Chandrasekhara Sastry**

T.T.D. Religious Publications Series No. 416
© All Rights Reserved

*First Edition :* 1992
*Second Edition :* 2016
*Copies :*

*Published by*
**Dr. D.SAMBASIVA RAO,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

***D.T.P***
Publications Division
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

## ముందుమాట

కృష్ణానదిని గూర్చిన స్తోత్రమే శ్రీకృష్ణాలహరి. కృష్ణావేణి సాక్షాత్తు శ్రీకృష్ణభగవానుని స్వరూపమనీ, పాపాలన్నీ పోగొట్టి సమస్త శుభాలను కలిగిస్తుందని ఈ స్తుతిలో చెప్పబడింది. అలాంటి కృష్ణాస్నానం చాలా మహిమాన్వితమైనదనీ, ఆ నదీతీరంలో చేయవలసిన తీర్థవిధులూ, ఆచరింపవలసిన వ్రతాలూ, శ్రాద్ధాదులూ ఇందులో చక్కగా వివరింపబడ్డాయి. 'కన్యాయాం కృష్ణవేణీ చ' అన్న వాక్యాన్నిబట్టి పండ్రెండేండ్ల కొకమారు గురువు కన్యారాశిలో ప్రవేశించిన తొలి పండ్రెండు రోజులు కృష్ణానదికి పుష్కరాలొస్తాయి. ఈ పుష్కరసమయంలో ముక్కోటి దేవతలు, మూడున్నర కోట్లతీర్థాలు కృష్ణను ఆవహించి వుంటాయట. ఆ సందర్భంలో కృష్ణా స్నానం, కృష్ణాతీరంలో చేసిన వ్రతాలు, విధులు మరింత సత్ఫలితాలిస్తాయనడంలో సందేహం లేదు.

సుమారు వందేళ్లకు పూర్వం, సాక్షాత్తు దత్తాత్రేయ స్వరూపులుగా ప్రసిద్ధి పొందిన శ్రీ వాసుదేవానందసరస్వతీ స్వామి (టెంబెస్వామి) వారు ఈ స్తుతిని సంస్కృతంలో వ్రాశారు. వీరు కురుగడ్డి, శ్రీశైలం, అమరావతి, విజయవాడ, మోపిదేవి, పెద్దకళ్లేపల్లి, హంసలదీవి మున్నగు కృష్ణాతీర క్షేత్రాలను దర్శించారు. ఆ సమయంలోనే శ్రీ టెంబేస్వామి కృష్ణాస్తుతిపరమైన 'శ్రీకృష్ణాలహరి' ని చెప్పారు. ప్రముఖ పౌరాణికులు శ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారు ఈ స్తోత్రానికి విపులమైన వ్యాఖ్య సమకూర్చారు.

ఈ పవిత్ర పుష్కరసమయంలో కృష్ణాయాత్రికులకు ఈ 'కృష్ణాలహరి'ని అందిస్తున్నాం. ఆస్తికులు, ఆధ్యాత్మ విదులు, భక్తులు యాత్రికులు ఈ పొత్తంలో తెల్పబడిన కృష్ణాయాత్రావిధులను ఆచరించి తరింతురుగాక!

*సదా శ్రీవారి సేవలో...*

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు



# కృష్ణాపుష్కర ప్రాశస్త్యం

**"కృష్ణవేణీతి యో బ్రూయాత్ సప్త జన్మార్జితాన్యపి,**
**మహాపాపాని నశ్యంతి విష్ణులోకం స గచ్ఛతి"**

పంచభూతములలో ఉదకము చాలా పవిత్రమైనది. మానవుడు బ్రతకడానికి కాని, పవిత్రుడు కావడానికి కాని నీరే ముఖ్యాధారం. 'ఆపో వా ఇదగ్ం సర్వం' అని శ్రుతి. 'అద్భ్యః అగ్నిః' అని భారతవచనము సృష్టి ప్రారంభమునకు నీరును ముఖ్యముగా చెప్పుచున్నవి. 'ఆపో నార ఇతిప్రోక్తాః ఆపో వై నరసూనవః'. ఈ సృష్ట్యాది యందు ఏకార్ణవమై ఉదకముతోటే నిండి ఉన్నదని అక్కడనుంచే సృష్టి ప్రారంభమైనదని చెప్పుచున్నారు. పంచభూతములను 'సత్యం' అన్నది శ్రుతి. 'సచ్చ త్యం చా భవత్'. సత్ అంటే భూమి, నీరు, అగ్ని అని, త్యం అంటే వాయువు, ఆకాశము అని, పంచమహాభూతములలో నీరు చాలా ప్రధానం అన్నారు. జీవకోటికి ఐహికాముష్మికములు నీటివల్లనే శుద్ధములవుతవి. ఇట్టి నీటినే శివశిరస్సులుగా వర్ణించబడ్డ పర్వతశిఖరాలనుంచి ఉత్తుంగతరంగాలతో ధ్వనులు చేస్తూ 'నద శబ్దే' నదించునది అనే పేరుతో నదులుగా బయలుదేరినవి. ఈ నదులు పర్వత శిఖరాలనుంచి భూభాగాలకు బయలుదేరి అనేక ఔషధుల దివ్యప్రభావంతో మానవుల శారీరక, మానసిక మాలిన్యాలను పోగొడుతూ భారత భూమియందు ప్రవహిస్తున్నవి. వీటిలో అవిచ్ఛిన్నమైన ప్రవాహములు కలిగి సముద్రాన్ని సంగమిస్తూ పొంగి పొరలే పుష్కరాలను జరుపుకునే నదులను మహానదులుగా గుర్తించారు. ఈ నదులలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్నాటకలలో ప్రవహించు నదీమతల్లి కృష్ణవేణీనది. పుష్కరములను జరుపుకొను నదులు 12 ఉన్నా కృష్ణానది ప్రాముఖ్యము వేరన్నారు. "కాచిత్ క్షాళయతి ప్రభోః పదయుగం కాచిత్

కమారోహతి" – ఒక నది పాదంలో పుట్టి, ఒక నది శిరస్సునుండి ప్రవహించినా కకుద్మతీనది బ్రహ్మగా, వేణీనది శివుడిగా, కృష్ణానది విష్ణువుగా సొంపులు నింపుతూ ఇంపగు సంపద నిస్తూ ప్రవహించే కృష్ణానదీ వైభవము చాలా గొప్పదన్నారు. పుష్కరుడు బ్రహ్మతో, సర్వదేవపరివారంతో 3½ కోట్ల తీర్థరాజములతో ఈ పుష్కరకాలంలో కృష్ణానదియందు అధిష్ఠించియుంటాడు. ఈ పర్వకాలంలో కృష్ణానదీ వైభవము మనం విచారించడం అత్యవసరము. శ్రీశ్రీ ప.ప. వాసుదేవానంద సరస్వతీ స్వామివారిచే రచించబడిన 'శ్రీ కృష్ణా లహరి'ని యథామతిగా స్వేచ్ఛా ఆంధ్రానువాదము జరుపుచున్న నా సాహసమునకు పండిత ప్రకాండులు మన్నింతురు గాక! శ్రీ స్వామివారి చరిత్రమును సంక్షిప్తముగా ఇందు చూపుచున్నాను.

**– మల్లాది చంద్రశేఖర శాస్త్రి**



**శ్రీ గణేశ గురుభ్యో నమః**
**శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య**
**శ్రీవాసుదేవానంద సరస్వతీ**
**'టేంబే స్వామి' వారి**

# సంక్షిప్త చరిత్రము

**సదా నందతి విద్వత్త్వాత్ సర్వదాఽతి విభుత్వతః,**
**మృత్యుం జయతి యోగిత్వాత్ యః స మే హృది తిష్ఠతు.**
**నమః శ్రీగురో గేశధీశే దయాబ్ధే**
**భయార్తిఘ్న తే స్వాత్మదో వాసుదేవ,**
**యతీట్ సేవితానంద పాదాబ్జయుగ్మం**
**సదా మే హృది స్థాస్నుతాం యాతు దేవ.**

సద్గురు శ్రీవాసుదేవానంద సరస్వతీ స్వామివారిని గురించి కొంచెం ముందు విచారించుకుందాం మహారాష్ట్ర దేశంలో సామంతవాడీ సంస్థానమునకు ఎనిమిది, తొమ్మిది మైళ్లలో 'మాణగాంవ్' అను గ్రామమున్నది. ఆ గ్రామమునకు ఒకటిన్నర మైలులో నిర్మలా అనుపేరు గల నది ఉన్నది. ఈ మాణగాంవ్ గ్రామమునందు బ్రాహ్మణులు వైదికవృత్తి నిష్ఠాగరిష్ఠులు. అందులో ఋగ్వేదశాఖాసంపన్నులు అత్రి గోత్రమందు శ్రీ హరిభట్ అను బ్రాహ్మణోత్తములు కలిగారు. వారికి పెద్ద కుమారుడు గణేశభట్టు అనువారు. ఆ గణేశభట్టు అత్యంత సాత్త్విక వృత్తి కలవారు. వారికి పూర్వజన్మ సంస్కారముతో శ్రీ దత్తాత్రేయ ప్రభువువారి పై దృఢమైన భక్తి కలిగింది. సంతతము శ్రీ దత్తాత్రేయ చింతనముతో తన్మయుడై యుండగా అనేక దృష్టాంతములు (భగవల్లీలలు) కనబడేవి. తరచుగా గాణగాపురం (శ్రీదత్తాత్రేయక్షేత్రం) వెళ్లి స్వామివారి సేవచేసి వస్తూవుండేవారు. తరువాత

శ్రీగణేశ భట్టు 12 సం॥లు ఒకే దీక్షతో గాణగాపురంలో శ్రీదత్తాత్రేయ సేవ చేశారు. అప్పుడు పరమాత్మ ప్రసన్నుడై నీ పట్ల నాకు అనుగ్రహం కలిగింది. ఇక నీవు ఇంటికి వెళ్లవచ్చు. ఇటుపై నీవు గాణగాపురం రావలసిన అవసరం లేదు అని స్వామి ప్రసాద మిచ్చారు. గణేశభట్టు ఇంటికి వెళ్లిన తర్వాత శక సంవత్సరం 1776 ఆనందనామ సంవత్సర శ్రావణ బహుళ పంచమీ ఆదివారం సూర్యోదయం నుంచి 26 ఘడియలకు (క్రీ.శ. 1854 సం॥) శ్రీవాసుదేవానంద సరస్వతీ స్వామివారు గణేశభట్టునకు కుమారుడుగా జన్మించారు. స్వామివారి తల్లి పేరు రమాబాయి. పుట్టినప్పటి నుంచి వేదోక్త సంస్కారసంపన్నులై తండ్రి వృద్ధుడు కావడంవల్ల యాజ్ఞికములు చేయిస్తూ కుటుంబ భారాన్ని నడుపుతూ 'మనసశ్చేంద్రియాణాం చ ఐకాగ్ర్యం పరమం తపః, తజ్జ్యాయః సర్వధర్మేభ్యః సధర్మః పరమః స్మృతః' అని చెప్పిన శాస్త్రరీత్యా ప్రశాంతచిత్తులై 8వ సం॥లో ఉపనయనము జరుపబడగా వేదాధ్యయనము సాంగముగా చేశారు. జ్యోతిశ్శాస్త్రము నేర్వవలెనని ఒక పండితుని దగ్గర ప్రారంభించారు. ఆ గురువుగారి ఎవ్వరికో ఒక ముహూర్తము పెట్టారు. ఆ ముహూర్తము తీసుకొని వాసుదేవ శర్మకు చూపించగా ఇది గురువుగారు పెట్టిందని తెలియక ఈ ముహూర్తము బాగుండలేదన్నారు. శిష్యుడు తను పెట్టినదానిని ఆక్షేపించాడని ఇక నీవు నా దగ్గర చదువవలసినది లేదు. వెళ్లవచ్చునన్నారు. నీకు విద్య పూర్తయ్యిందన్నారు. అది గురువుల ఆశీర్వచనముగానే భావించారు స్వామివారు. "వేదాభ్యాసో హి విప్రస్య తపః పరమిహోచ్యతే" "స్వాధ్యాయోధ్యేతవ్యః తద్ధీతపః తద్ధితపః" అని శ్రుతి స్మృతి వచనానుసారంగా అద్భుత తపశ్చర్యతో గాయత్రీజపప్రభావముతో శ్రీదత్తాత్రేయ సాక్షాత్కారపాత్రులైనారు. స్మార్తవైష్ణవ ఏకాదశులు రెండు ఉపవసించి సంపూర్ణజాగరణ చేసేవారు. పౌరోహిత్యముతో సంసారభారము నడుపుతూండేవారు. సకాలసంధ్యావందనం, దేవతార్చన, వైశ్వదేవం



చెయ్యనిదే భోజనం చేసేవారు కారు. పరాన్న భోజనం ఎప్పుడూ చేసేవారు కారు. "సర్వథా స్వహితమాచరణీయం" అను న్యాయమునుబట్టి స్వధర్మమును ఎప్పుడూ వదిలేవారు కారు. ఒక వస్త్రం కట్టుకోడానికి, ఒక వస్త్రం పైన వేసుకోడానికి ఉండేవి. 'న మాతుః పరదైవతం' అను శాస్త్రప్రమాణమును బట్టి మాతృదేవతయందు అపారమైన భక్తితో ఉండేవారు. ఒకసారి ఉపదేశం తోటే సకల శాస్త్రములు గ్రహించారు. తర్వాత గృహస్థాశ్రమం స్వీకరించారు. 21 సం॥లో వివాహం జరిగింది. వివాహానంతరం స్మార్తాగ్ని ఉపాసన చేశారు. ప్రశ్నభాగంలో, జ్యోతిషంలో, ధర్మశాస్త్ర విషయంలో, సర్వశాస్త్రములయందు సర్వజ్ఞులైనారు. ఒకరోజు యాజ్ఞికమునకై ఇతర గ్రామము వెళ్లారు. దారిలో సర్పము కనపడినది. దాన్ని మంత్రించి బంధించారు. వెళ్లి యాజ్ఞికము పని చూచుకొని తిరిగి వచ్చేటప్పటికి సర్పము అక్కడే బంధింపబడియున్నది. దాన్ని చూచి దయగలవారై బంధవిముక్తి చేసి ఇక మీద ఎప్పుడూ సర్పముల మీద ఇల్లా ప్రయోగించకూడదు అనుకున్నారు. దయాశాలియై ఎందరో భక్తులను ఉద్ధరించారు. తర్వాత నర్సోబావాడీ దర్శనం చేశారు. ఎందరో పెద్దల్ని దర్శించేవారు. శ్రీదత్తాత్రేయ మూర్తిని ఆరాధించారు. దత్తసేవలో దత్తజయంతి ఉత్సవములు జరిపేవారు. గురుద్వాదశీ పర్వమందు (శ్రీపాద శ్రీవల్లభ అంతర్ధాన ద్వాదశి) మహోత్సవం జరిపి అన్నదానములు జరిపారు. శ్రీదత్తాత్రేయ ఆజ్ఞతో గురుచరిత్రకు మరాఠీమూలమునకు ద్విసాహస్రీగురుచరిత్ర మని సంస్కృత గ్రంథాన్ని రచించారు.

ఒక గురుద్వాదశికి వెయ్యిమంది ప్రసాదము స్వీకరించే సమయంలో బ్రహ్మాండమైన వర్షం పడే పరిస్థితి వచ్చినప్పుడు ఓ మేఘరాజా! భక్తులను నీవు ఇబ్బంది పెట్టబోకు. దూరముగా వెళ్లు అని ప్రార్థిస్తే వర్షము తొలగిపోయినది. నిత్యయోగాభ్యాసరతులై యుండేవారు. "అహింసా

ప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః" అను యోగసూత్ర ప్రమాణముగా శ్రీవారున్నచోట వైరద్వేషాదు లుండేవికావు. సంతత యోగాభ్యాసమందుండేవారు. శ్రీదత్తమూర్తిని ఆరాధిస్తూ యుండేవారు. ఎందరినో రోగార్తులను అనుగ్రహించి ఉద్ధరించారు. ఎందరో వీరి సాంగత్య ప్రభావము చేత దత్తభక్తులైనారు. స్వామివారికి పూర్వాశ్రమంలో ఒక స్త్రీ శిశువు కల్గింది. పండరీపూర్ వెళ్లారు ఒకసారి. అక్కడ సదాచార నియమం గలవారు కనుక ప్రసాదం తీసుకోకుండా వస్తే పాండురంగస్వామే వచ్చి నేను తెచ్చి ఇస్తున్నా ఈ ప్రసాదం తీసుకోమన్నారు. వాసుదేవశాస్త్రి గార్కి శక సం.రం 1813 వైశాఖ బహుళ చతుర్దశి శుక్రవారమందు వీరి ధర్మపత్ని అన్నపూర్ణాబాయి గౌరీలోకానికి చేరింది. "అనాశ్రమీ న తిష్ఠేత" అను శాస్త్రవిధిని బట్టి సంన్యాసాశ్రమమందు ఇచ్ఛ కలిగింది. శ్రీదత్తాత్రేయమూర్తి స్వప్నమందు గోవిందస్వామిగా దర్శనమిచ్చి కాషాయవస్త్ర మిచ్చి ప్రణవోపదేశం చేశారు. తరువాత నారాయణానంద సరస్వతి దగ్గర దండగ్రహణము చేశారు. ఆ స్వామివారు దత్తావతారమైన శ్రీనృసింహసరస్వతీ వంశమందలి శుక్లయజుర్వేదీయులు. వర్ణాశ్రమ ధర్మయుక్తముగా త్రికాల స్నానములు, దండతర్పణ, ప్రణవజపాదులు చేసి దత్త ప్రతిబింబమునకు పూజ చేసేవారు. అనేక పుణ్యక్షేత్రములు సంచరించారు. ఎందరో భక్తుల నుద్ధరించారు. ప్రాక్, పశ్చిమ, దక్షిణోత్తర భారతదేశమంతా ముమ్మారు ప్రదక్షిణం చేశారు. గుజరాత్ ప్రాంత అరణ్యమందు వెడుతూ ఉండగా అశ్వత్థామ దర్శనమైనది. మీరు అశ్వత్థామే కదా అని అడిగితే భిల్లరూపంలో ఉన్న అశ్వత్థామ మీరు తెలుసుకోగలిగారని అన్నాడు. కాశీనివాసంలో అనేకమంది భక్తుల నుద్ధరించారు. కొంతమంది స్వామివారి దగ్గర పురాణ శ్రవణం చేసేవారు. చాతుర్మాస్యలలో ఎందరో అధికారులైన శిష్యులు జ్యోతిష, యాజ్ఞిక, వేదాంత, యోగ శాస్త్రములు



మొదలైన విషయములయందు శ్రీస్వామివారిని సద్గురువులుగా పొంది అధ్యయనం చేశారు. బ్రహ్మావర్తంలో 2 సం॥లు సంచరించారు. బ్రహ్మావర్తంలో ఉండగానే దత్తపురాణము అను సంస్కృత గ్రంథమును రచించారు. బ్రహ్మావర్తంలో ఉండగానే దత్తపురాణము అను సంస్కృత గ్రంథమును రచించారు. ఋక్ సంహిత నిరూపణ శ్లోకములు రచించారు. బ్రహ్మావర్తం నుంచి గోకులం, బృందావనం, మథుర వగైరాలు సంచరిస్తూ హరిద్వారం చేరారు. హరిద్వారంలో చాతుర్మాస్యలు చేశారు. అక్కడినుంచి బదరీ క్షేత్రానికి వెళ్లారు.

ఇప్పుడు బదరికి యాత్రాసమయము కాదు అని నివారించినా వినక వెళ్లగా మందిరములో నుంచి ఇద్దరు దీర్ఘబాహువులు కలిగి, విశాల వక్షస్థలాలతో శోభించే నూతన పురుషులు వచ్చి ఇప్పుడు వెళ్లడానికి దారిలేదు వెళ్లితే ప్రమాదము అవుతుంది. అంటే ఏమైన కానీ ఇపుడు దర్శనానికే వచ్చానన్నారు. నీవు ఈ పట్టుదలతో ఉన్నావని మేమే నీకు దర్శన మిద్దామని వచ్చాము అని ఆ ఇద్దరు చెప్పి అంతర్ధాన మయ్యారు. ఆ తర్వాత 2 చాతుర్మాస్యలు యోగసమాధిలో స్వామివారు ఎక్కడ ఉన్నదీ తెలియటంలేదు. చరిత్ర కందని విషయం ఇది.

ఇందూర్ (ఇండోర్) సంస్థానంలో పేటలాద్ నర్మదా మహానదీ తీరంలో చాతుర్మాస్యలు చేశారు. అక్కడనే ఆషాఢ శుక్ల పక్షంలో 'దత్తలీలామృతసింధు' అనే మహారాష్ట్ర గ్రంథాన్ని రచించారు. అక్కడనే ఎందరో శిష్యులు స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. ఉదయం ఉపనిషత్ భాష్యప్రవచనం చేసేవారు. సాయంత్రం పురాణ ప్రవచనం చేసేవారు. ఎందరో భక్తులు స్వామివారి బోధలతో పవిత్రులైనారు. అధికారులైన శిష్యులకు యోగాభ్యాసము, షట్క్రియావిధానము, ప్రాణాయామము శిక్షణ లిచ్చారు. అక్కడనే దీపావళి వచ్చింది. ఇక్కడ ఒక గొప్ప ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది. స్వామివారి

చేత రోజూ దత్తమూర్తి పూజించబడేవారు. నరక చతుర్దశినాడు శ్రీదత్తప్రభువు ఈ రోజు నాకు అభ్యంగనస్నానం సుగంధ ద్రవ్యాలతో చేయించవలె అన్నారు. దానికి వాసుదేవానంద సరస్వతీ స్వామివారు నేను సంన్యాసిని. నేను అగ్ని ముట్టుకోకూడదు. వేడినీళ్లు ఎల్లా? పెట్టేది సుగంధద్రవ్యాలు ఎక్కడనుంచి తేను. రోజూలాగానే చన్నీళ్లు అభిషేకం చేసి, భస్మం వేసి, తులసి పెడతానన్నారు. అల్లాగే స్వామికి అభిషేకం చన్నీళ్లతో చేసి, భస్మంవేసి, తులసి పెట్టి మధుకరమునకు వెళ్లారు. తిరిగి వచ్చి పాదప్రక్షాళన చేసుకొని నైవేద్యానికి స్వామి విగ్రహాన్ని చూస్తే లేరు. స్వామిని వెతుకుతూ నర్మదానది దగ్గరకు వెళ్లగా లోపల నుంచి పెద్ద ధ్వని వినపడుతున్నది. 'ఈ రోజు దీపావళి. మంగళస్నానం చేయించమని అడిగాను. నువ్వు చన్నీళ్లుపోసి ఊరుకున్నావు. సుగంధ తైలాలతో అభ్యంగన స్నానం అయితేగాని నేను రాను. నీ నైవేద్యం అక్కరలేదు' అని అరిచారు. స్వామివారు భిక్ష చేయకుండా నది దగ్గర ఉన్నారని గ్రామస్థులు వచ్చారు. స్వామివారి వలన ఈ విషయం తెలిసికొని సుగంధతైలాలు, పంచామృతములు, ఉష్ణోదకం తీసుకొని వచ్చి శ్రీదత్తాత్రేయమూర్తికి అభ్యంగన స్నానం చేయించి స్వామివారు హారతి ఇచ్చారు.

మిత్రుడూ మిత్రుడూ మాట అనుకుంటే మళ్లీ ఒకటి అవుతారు. దంపతుల మధ్య కలహం వచ్చినా స్నేహం చెడదు. కలహం క్షణమాత్రమే. పరమాత్మకు పరాభక్తి కల్గిన భక్తులకూ అల్లాగే ఉంటుంది సన్నివేశం. జ్ఞానోత్తరకాలీన భక్తి పరమోత్తమ సుఖస్వరూపమైన భక్తి. సగుణమూర్తి ఆరాధన చేతనే నిర్గుణ ధ్యానము, జ్ఞానము కలుగుతుంది. ఇదియే శ్రీదత్తాత్రేయమూర్తి చూపించారు భక్తులకు. ఆ తరువాత తిలకవాడ అనేచోట 8వ చాతుర్మాస్య చేశారు. ఈ ప్రాంతమందు ఉండగానే నర్మదానది వచ్చి స్వామీ! మీరు ఎప్పుడూ గంగా తీరమందు ఉంటే నేను ఎప్పుడు



కృతార్థురాలనవుతాను? కనుక మీరు వచ్చి నా తీరమందు నివాసం చెయ్యాలి అని కన్యారూపంగా వచ్చి ప్రార్థిస్తే నర్మదానదియందు అనుగ్రహం కలిగి నర్మదాతీరం కూడా వెళ్లారు. ఆ నర్మదా తీరానికి వెళ్లేటప్పుడు దక్షిణాచార సంపన్నులైన గృహస్థులు లేక 30 రోజులు ఉపవాసం తోటే రోజూ 20 మైళ్లు నడుస్తూ వెళ్లేవారు. ఒకరోజు మరల కన్యారూపముగా నర్మదానది వచ్చి ఏడుస్తూ మిమ్మల్ని రమ్మని నేను పాపం కట్టుకున్నాను. ఈ రోజు మీకు భిక్షకు శ్రోత్రియ గృహస్థులను చూచివచ్చానని ఆ రోజు భిక్ష ఏర్పాటు చేసింది. ఇట్లాంటి విశేషలీలలు శ్రీ స్వామివారి చరిత్రలో ఎన్నో ఉన్నాయి. తరువాత గుజరాత్‌లో ద్వారకానగరమందు 9వ చాతుర్మాస్య చేశారు. సరస్వతీ నదీ తీరమైన సిద్ధపురమందు దత్తజయంతి జరిపించారు. తరువాత 10వ చాతుర్మాస్య 'చిఖలదా' నర్మదాతీరంలో గడిపారు. 11వ చాతుర్మాస్య మహత్పూర్ అనే స్థానంలో జరిపారు. అక్కడ ఉండగానే మహత్పూర్‌లోనే దత్తమాహాత్మ్యమను మహరాష్ట్ర గ్రంథాన్ని రచించారు. త్రిశతీ గురుచరిత్ర మహారాష్ట్రమందు దత్తమాహాత్మ్యమను గ్రంథము రచించారు. బ్రహ్మావర్తమునకు చేరి 12వ చాతుర్మాస్య చేశారు. బ్రహ్మావర్తంలోనే నిత్యశ్రీర్నిత్యమంగళం అనునట్లుగా ఎందరో భక్తులు శ్రీస్వామివారి దివ్యప్రబోధములను శ్రవణము చేసినారు. యోగ జ్ఞానాదులయందు ఎందరో భక్తులకు శిక్షణ లిచ్చారు. 13, 14 చాతుర్మాస్యలు బ్రహ్మావర్తమందే జరిగినవి. 15వ చాతుర్మాస్య నరసీలో జరిపారు. అక్కడ ఎందరో భక్తులు కృతార్థులైనారు. తర్వాత 16వ చాతుర్మాస్య శ్రీదత్తాత్రేయక్షేత్రమైన నర్సోబావాడీలో జరిగినది. ఇక్కడనే ద్వ్యర్థి షడానన స్తోత్రాదిసంగ్రహం రచించారు. అటుపైన సంచారం చేస్తూ ఘటప్రభా, విశ్వామిత్రీ నదీతీరములను తుంగభద్రానదీ తీరమందున్న హంపి క్షేత్రమును, విరూపాక్ష మందిరమును, ఋష్యమూక పంపాసరోవర, కిష్కంధ మొదలైన చోట్ల స్నానదానస్తుతులు చేశారు.

ఆపైన వేంకటాచలమునకు (తిరుమల) వచ్చి శ్రీవేంకటేశ్వర దర్శనస్తుతులను చేశారు. కుమారశిక్షను రచించారు షోండూర్ అను సుబ్రహ్మణ్యక్షేత్రమునందు. ఈ తిరుమలకు వచ్చినపుడు స్వామివారు వేంకటేశ్వరుని దర్శన స్పర్శములకు పూజారులు అనుమతివ్వలేదు. వెంటనే శ్రీ వేంకటేశ్వరుడు స్వామివారిని తీసుకొనివచ్చి దర్శన స్పర్శనములు జరిపించమని పూజారులకు ఆజ్ఞాపించగా శ్రీవాసుదేవానంద సరస్వతీ స్వామివారిని అమితభక్తితో పూజారులు తీసుకొనివచ్చి మూలవిగ్రహమునకు దర్శన స్పర్శనాదులు జరిపించారు. ఈ తిరుమలలోనే అప్పుడు వేంకటేశ్వర స్తోత్రం రచించారు. తర్వాత స్వామివారు కాళహస్తి, శివకంచి, విష్ణుకంచి, పక్షితీర్థం వగైరాలన్నీ సేవించుకుంటూ చిదంబర క్షేత్రానికి చేరారు. చిదంబర క్షేత్రంలో సుందరశాస్త్రి అను ఒక పండితుడు ఉన్నాడు. ఆయనకు సంస్కృత పాండిత్య అభిమానము ఎక్కువ. ప్రాకృతభాషలో ఏమున్నది. సంస్కృత మందే, శాస్త్రములయందే గొప్పతనమున్నదని అహంకరించాడు. అప్పుడు స్వామివారు ఆయనకు హితోపదేశం చేశారు. శాస్త్రజ్ఞుడనే అభిమానం ఉన్నప్పుడు భగవద్భక్తి లభించదు. భక్తిలేనిదే భగవంతుని కృప కలుగదు. జ్ఞానము రాదు. ముక్తి లేదు. కనుక శ్రీదత్తాత్రేయ కృప కలుగవలెనంటె నీవు శ్రీగురుచరిత్ర పారాయణచెయ్యి. దానితో ఆ సుందరశాస్త్రి దురభిమానం పోయింది. తరువాత స్వామివారు రామేశ్వరం వెళ్లారు. శ్వేతారణ్యం, కుంభకోణం, మధురమీనాక్షి దర్శనములు చేస్తూ వెళ్లారు. భక్తులు ప్రార్థించగా తంజావూర్‌లో సంధ్యామండపమందు 17వ చాతుర్మాస్య జరిపారు. తంజావూర్‌లోనే కృష్ణాలహరి సంస్కృతటీక వ్రాశారు. కావేరీ తీరం నుంచి శ్రీ సదాశివ బ్రహ్మేంద్ర స్వామివారి సజీవ సమాధి దగ్గరకు వెళ్లి దర్శనం చేశారు. అక్కడ "స్వానందరసోన్మత్తః స్వాంగం విస్మృత్య యో నరీనర్తి" అని మొదలైన స్తోత్రములు చేశారు. 2 రోజులు నివసించారు అక్కడ. అక్కడ



నుంచి చిదంబరం వగైరాలు చూచుకొంటూ త్రిపురాంతకం వెళ్లి శ్రీశైలం చేరారు. అక్కడ నుంచి కృష్ణాతీరము అంతా తిరిగారు. స్వప్నమందు కృష్ణానది దర్శనమిచ్చింది. అక్కడ నదిని స్తోత్రము చేశారు. తరువాత కృష్ణాతీరమందున్న ముక్త్యాలలో 18వ చాతుర్మాస్య చేశారు. అక్కడ చాలామంది విద్వాంసులు సంస్కృత పండితులు ఉన్నారు. వారికి గురుచరిత్ర ప్రాముఖ్యమును వినిపించారు. ఒక పండితుడికి సంస్కృత భాషయందున్న దురభిమానాన్ని పోగొట్టి, గురుచరిత్ర పారాయణ చేయించి అతని ఇంట్లో ఉన్న బ్రహ్మరాక్షస ప్రతిబంధకాన్ని తీర్చారు.

చాతుర్మాస్య వ్రతదీక్ష పూర్తికాగానే బయలుదేరి కృష్ణకు అవతలి ఒడ్డున ఉన్న పంచారామక్షేత్రములలో ప్రసిద్ధమైన అమరావతికి వచ్చి అక్కడ సుమారు 2 మాసములు నివసించారు. అక్కడనే మల్లాది రామకృష్ణ చయనులవార్కి వేదాంతరహస్య గ్రంథములను ఉపదేశించారు. తర్వాత దీపావళి అనంతరం కృష్ణాతీరసంచారం చేస్తూ వెల్లటూరు గ్రామమునకు వచ్చి కృష్ణానది సముద్రసంగమమైన హంసల దీవికి చేరారు. ఆ తరువాత మచిలీపట్నానికి సమీపంలో ఉన్న పెదకళ్లేపల్లికి వచ్చి 3 రోజులు ఉన్నారు. తరువాత సప్తగోదావరులు దర్శించారు. కోటిలింగం, కౌశిక, వాసిష్ఠ, గౌతమి, వృద్ధగౌతమీ, భారద్వాజ, ఆత్రేయ, తూర్య సప్తగోదావరులు దర్శించారు. రాజమహేంద్రవరం వచ్చి బ్రహ్మానంద సరస్వతీ స్వామివారి కోరికతో శ్రీదత్తమూర్తి పాదుకా స్థాపన చేశారు. తరువాత పిఠాపురం వెళ్లి భక్తులకు శ్రీపాద శ్రీవల్లభ స్థానమును చూపించారు. ఆ తర్వాత 'దిగంబరా, దిగంబరా శ్రీపాద వల్లభ దిగంబరా' అనే నినాదముతో కాకినాడ వెళ్లారు. 19వ చాతుర్మాస్య పవనీలో చేశారు. హావనూర్ త్రిపురాంతకేశ్వరుడి దేవాలయమందు 20వ చాతుర్మాస్య చేశారు. కృష్ణాతీరమందున్న కురుగడ్డి (కురువపురం) శ్రీదత్తాత్రేయ శ్రీపాద శ్రీవల్లభస్థానమందు 21వ చాతుర్మాస్య

చేశారు. అక్కడ ఎందరో భక్తులను ఉద్ధరించి స్వామివారి స్థానమహిమను ప్రకటించారు. ఇందూర్ (ఇండోర్) సంస్థానమందున్న చిఖలదా అనే నర్మదాతీరమందు 22వ చాతుర్మాస్య చేశారు. నర్మదా తీరమందున్న కినార్ దగ్గర గరుడేశ్వరంలో చివర 23వ చాతుర్మాస్య జరిపారు. మరొకచోట మరణించినవారిని అనుగ్రహంతో బ్రతికించారు.

ఎందరో నాస్తికులైనవారు శ్రీవాసుదేవానందసరస్వతీ స్వామివారి దివ్య దర్శన ప్రబోధ అనుగ్రహ ఆశీస్సులతో ప్రాపంచకమైన సంకటములను దాటి శ్రీదత్త భక్తియుక్తులై యోగ జ్ఞానములను సంపాదించి ఈ భారతదేశంలో కృతార్థులైనారు. శ్రీదత్తాత్రేయ అంశావతారమగు శ్రీవాసుదేవానంద సరస్వతీ యతీంద్రుల శతాధిక సంస్కృత ప్రాకృత గ్రంథములు పఠన, పాఠన పారాయణ, శ్రవణాదులు జరుపుకుంటూ ఇప్పటికీ భక్తులు శ్రీదత్తాత్రేయ కృపాపాత్రులు అగుచున్నారు. ఇందు దృష్టాంతములు వేనవేలు ఉన్నవి. శ్రీశ్రీ స్వామివారు శక సం॥ 1836 (క్రీ.శ. 1914 సం॥) ఆషాఢశుక్ల ప్రతిపత్తున భౌతిక శరీరానికి సమాధి తీసుకున్నారు. అయినప్పటికీ వారి చరిత్ర, వారి మహిమ అజరామరము.

**"జితేంద్రియ గణాగ్రణీ రభిరతః పరే బ్రహ్మణి**
**కలౌ శ్రుతిపథావనే అత్రిపుత్రః అవతీర్ణః స్వయమ్.**
**కరాత్తసుకమండలుః కుమతఖండనే దండభృత్**
**పరప్రణతవత్సలో జయతి వాసుదేవో గురుః"**

*ఇతి శివమ్.*





**కృష్ణవేణి పాదాలు**

# శ్రీకృష్ణాలహరి

**మాలాం కుండీం చ దమరుం శూలం శంఖం సుదర్శనమ్,**
**దధానం భక్తవరదం దత్తాత్రేయం నమామ్యహమ్.**

శ్రీ దత్తాత్రేయా విజయతే. సమస్తజీవకోటికి మిక్కిలి క్లేశాన్ని యిచ్చేటటువంటి అవిద్యాకామకర్మలు అనే మహాబంధములనుంచి మోక్షము జ్ఞానములేనిదే కలుగదు. కనుక మోక్షము రానిదే ఉపాధిరహితమైన నిరతిశయమైన స్వస్వరూపమైన పరమానంద ఆత్మస్థితి లభించదు. కనుక అట్టి జ్ఞానము కలుగుటకు ప్రతిబంధకములైన పాపములు నశించవలె. కనుక అట్టి సర్వపాపములను పోగొట్టుటయందు సమర్థమైన శ్రీ కృష్ణానదీ మాతయొక్క స్తుతిని శ్రీ ప. ప. శ్రీ వాసుదేవానంద సరస్వతీ యతిచరణులు ప్రారంభించుచున్నారు. అయితే అట్టి సర్వపాపములను పోగొట్టుటయందు సమర్థములైన గంగాది నదులు శ్రుతుల చేత ప్రసిద్ధములై యున్నవి గదా! ఆ నదులను వదలిపెట్టి ఈ కృష్ణానదినే స్తుతించుట ఎందుకు? అనగా కృష్ణానదియే సాక్షాత్ విష్ణువుగా, వేణీనది శంకరునిగా పేర్కొనబడుటచేత ఈ కృష్ణవేణీనదియే స్తుతించుటకు అవసరమనిపించింది.

''కృష్ణా విష్ణు తనుస్సాక్షాత్, వేణీ దేవో మహేశ్వరః'' అని చెప్పబడుచున్నది. "తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేన దానేన తపసాఽనాశకేన" అని శ్రుతిచేత యజ్ఞాదులకు బ్రహ్మసాక్షాత్కారము గురించి పరంపరగా సాధనత్వము చెప్పబడుచున్నది. అంతేగాని నదీతీర్థసేవనమును చెప్పలేదు కదా! అంటే తీర్థయాత్ర కూడా శ్రుతులయందు పేర్కొనబడుటచేత ఈ స్తోత్రము పరమ పూజ్యమే.

## 1

**చతుర్బాహుః శ్రీమత్సజలజలద శ్యామలతనుః**
**ప్రకాశద్వక్త్రేందుః సదుడుగణ ముక్తావళిరపి,**
**తటిద్వాసాభాస్వ త్సుతిలకలసన్ మౌళి రఘుహృత్**
**క్షమాధ్రస్య హ్యత్రేరపి జయతి సూనుః స్వహితకృత్.**

నాలుగు బాహువులు కలిగిన, నీటితో నిండిన మేఘమువంటి శ్యామల వర్ణముతో శోభించే మహానీలమణివలె దివ్యశోభతో కూడినది. ప్రకాశించే ముఖమనే చంద్రుడు కలిగినది. నక్షత్ర సమూహమువలె శోభించే ముత్యముల హారములు కలది. మెఱుపు తీగవలె దివ్యకాంతులుగల వస్త్రము కలది. ప్రకాశించే కుంకుమ తిలకము నుదుటియందు కలది. సేవించువారి పాపములను, దుఃఖములను, దుర్వ్యసనములను పోగొట్టి తనను భజించువారికి హితమును చేసేది. మిక్కిలి శత్రువులయినటువంటి కామాదులను నశింపచేయునది.

*"ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా,*
*కామరూపేణ కౌంతేయ"*

అని గీతలో చెప్పబడినది. కనుక జ్ఞానమునకు పరమ శత్రువులు కామాదులే అని తెలుసుకోవాలి. సహ్యపర్వత పుత్రిక అయిన (కృష్ణానది సహ్యపర్వతంలో పుట్టింది.) కృష్ణానది భక్తుల ననుగ్రహిస్తూ శోభించుచున్నది. గ్రంథమునకు మొదటి శ్లోకము గనుక మంగళ రూపముగా శ్రీ దత్తాత్రేయస్తుతి గలది.

*"మాతరం సర్వతీర్థానాం నదీనామగ్రజాం త్వహమ్,*
*స్రక్ష్యామి పూర్వవత్ కృష్ణాం మన్మయీాం జగతః స్థితేః"*

*"తీర్థానాం హి ప్రభావేణ కలికల్మషశత్రుణా,*
*కృష్ణాయాశ్చాపి సాన్నిధ్యాత్ పాపం నైవ భవిష్యతి."*
– కృష్ణా మాహాత్మ్యం



కలియుగంలో సర్వజీవులకు పాపములను పోగొట్టడంలో సమర్థమైన దానినిగా తీర్థము లన్నిటికి తల్లిగా, నదులకు అగ్రజగా (అక్కగా) జగత్తుల యొక్క రక్షణకై పరమాత్మచేత తన స్వరూపముగానే కృష్ణానది సృష్టింపబడినది. ఈ నదులయొక్క తీర్థప్రభావము కలికల్మషాన్ని పోగొడుతుంది. కృష్ణానదీ తీరములో నివసించినవారికి పాపస్పర్శకూడా ఉండదని మాహాత్మ్యములో చూపించబడినది. జలరూపిణి అయిన ఈ కృష్ణవేణి హరిహరాత్మకముగా ప్రసిద్ధ మైనది. శివకేశవ స్వరూపమైన కృష్ణవేణీనదిని స్తోత్రముచేయుట పరమపావనము గదా!

వాక్కుకు, మనస్సుకు అందని మాహాత్మ్యము కలిగిన కృష్ణానదిని స్తోత్రముచేసే ప్రవృత్తి ఎందుకు కలిగింది? అంటే –

## 2

**అపి శ్రీకృష్ణే తే మహిమ పరపారం వ్రజతి కో**
**న శేషోఽ శేషాస్యైరపి కథయితుం వా ప్రభవతి,**
**అతో హ్రీతో వాచశ్శుచయ ఇహ వచ్మ్యల్పకమిదం**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

కృష్ యనగా సన్మాత్రమైనది; చిన్మాత్రమైనది. ణకారము నివృత్తిని తెల్పునది. కృష్ణయనగా సత్యజ్ఞాన ఆనంద స్వరూపమైనది. స్వాభావికమైన ఐశ్వర్యాది షడ్గుణములతో శోభించునది కృష్ణానది. అటువంటి ఓ తల్లీ! నీయొక్క ప్రభావమును చివరిదాకా తెలియగలవాడెవడున్నాడు? ఎవ్వనికి అంతుపట్టనిది. బ్రహ్మకుకూడా తెలియతరము కాదు. ప్రళయమందు కూడా తాను లయముకాక మిగులుతాడు గనుక ఆయనకు శేషుడని పేరు. ఆ ఆదిశేషువు వేయిముఖములతో కూడా నీ మహిమను చెప్పడానికి సమర్థుడు కాడు. ఇట్టి నీ ప్రభావములు తెలిసి కూడా అసమర్థుడనైన నేను సిగ్గుపడుతూ నా వాక్కు పరిశుద్ధం కోవడంకోసం నా మనస్సును గోచరించిన అతిస్వల్పమైన

స్తోత్రాన్ని చెబుతున్నాను. హే కృష్ణే! నీకు నా నమస్కారము. నీ భక్తులైనవారికి ఆశ అనే పాశము తెగిపోతుంది. ఈ ఆశాకామాదులవలననే మరల జన్మబంధాదులు కలుగుతాయి. కృష్ణానదీ తీర్థస్నాన పానాదులచేత ఆ బంధములు తొలగిపోతాయి. శ్రీ దత్తాత్రేయ గురుమూర్తికి ప్రియమైన నదీమతల్లివి నీవు. నీ భక్తులను ఉద్ధరించు ప్రభావమును ప్రకటించుము. తల్లీ నీకు నమస్కారము. ఇక్కడ నమస్కార రూపమైన యజ్ఞమనేది సూచించబడినది. సూత్రకర్త అయిన ఆశ్వలాయనుడు ఇలా చెప్పాడు.

*"యో నమసా స్వధ్వరఇతి నమస్కారేణవై ఖల్వపి న వై దేవా నమస్కారమతి యజ్ఞో వై నమ ఇతి హి బ్రాహ్మణం భవతీతి".*

నమస్కారమే యజ్ఞమన్నాడు ఆశ్వలాయనుడు. కృష్ణానదికి నమస్కరించినా ఆశ అనేది తొలగుతుంది. ఆశయే మితిలేనిది. జీవిని ఆశ వెంటపడునప్పుడు నరకప్రాప్తి కలుగుతుంది.

*"ఇచ్ఛతి శతీ సహస్రం సహస్రీ లక్షమీహతే కర్తుం లక్షాధిపతీ రాజ్యం రాజా పి సకలచక్రవర్తిత్వమ్. చక్రధరోఽపి సురత్వం తల్లాభే సకల సురపతిత్వం సురపతి రూర్ధ్వ గతిత్వం తథాపి న నివర్తతే తృష్ణా".*

*"తృష్ణయా చాఽభిభూతస్తు నరకం ప్రతిపద్యతే, తయా ముక్తాశ్చ యే కేచిత్ స్వర్గవాసం లభన్తి తే"* – గరుడ పురాణం

ఎప్పటికీ తప్పించుకోలేని జన్మ కర్మ బంధాన్నిచ్ఛేదించుచేటటువంటి ఈ ఆశాపాశాన్ని కృష్ణానదీ సేవనంచేత పోగొట్టుకోవచ్చున్నారు.

## 3

**అలక్ష్యం తే రూపం వచన హృదయాధ్వాతిగమతో**
**నతోఽహం తే లక్ష్యం కథమపి చ విజ్ఞాయ వరదే,**
**ప్రవృత్తస్త్వాం స్తోతుం స్వమతిగతితస్తే వరముదే**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**



భక్తులకు సర్వాభీష్టములను తీర్చునటువంటి హే కృష్ణే! నీ రూపము ప్రత్యక్షాది ప్రమాణములచేత గోచరముకాదు. వాక్కులకందదు. మనస్సుకు, ఊహలకు, ఆలోచనలకు దూరమయినది. ప్రత్యక్ష, అనుమాన, ఉపమాన శాబ్దములనే ఏ ప్రమాణమునకు నీ స్వస్వరూపము భగవద్రూపము కనుక ఏ ప్రమాణములచేతను గుర్తించలేరు. *"యతోవాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ"* అని శ్రుతి చెబుతుంది. అందువలన నేను వినమ్రుడనై సద్గురువుల కరుణా కటాక్షముల వలన అలౌకికమైన నీ దివ్యరూపమును నాకు వీలైనంత తెలుసుకుని నీకు పరమప్రీతిని కలిగించుటకై లేక కృష్ణవేణికి వరు డనగా శ్రీదత్తాత్రేయ గురుమూర్తి. శివవిష్ణు స్వరూపమైన కృష్ణానదియే శ్రీదత్తాత్రేయమూర్తికి ప్రీతిపాత్రమని ప్రసిద్ధము. అందుకనే శ్రీదత్తాత్రేయ క్షేత్రములన్నీ కృష్ణానదీ తీరముననే ఉంటాయి.

భగవానుడు త్రిమూర్తిస్వరూపుడు. కనుక గుణాతీతుడైన పరమాత్మ యొక్క లీలలు సామాన్యులకు తెలియనలవికావు. అట్టి భగవత్కటాక్షమును సంపాదించవలెనంటే కృష్ణానదీతీరమున నివాసము చేయవలె. ఆ నదీ తీర్థముయొక్క స్నానపానాదులచేత అంతఃకరణము శోధించబడుతుంది. తద్వారా భగవద్జ్ఞానము కలుగుతుంది. అందుకే దత్తభక్తులు కృష్ణానదీతీర సంచారము చేస్తారు తప్పకుండా.

ఇట్టి కృష్ణాస్తుతిని నా బుద్ధికి తోచినంతవరకు చేయడానికి పూనుకున్నాను అన్నారు శ్రీవాసుదేవానంద సరస్వతీ స్వామివారు.

## 4

**కృతా సాహిత్యజ్ఞై రపి సుగుణ సంపత్సులలితా**
**మితార్థాఽస్తానర్థా న చ తవముదే సాఽపి కవితా**
**సమర్థాఽథాపి త్వం శిశువచనవన్మే శృణు ముదా**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

ఛందస్సులు, అలంకారాలు, రీతులు, వీథులు, శయ్యలు గుర్తించి వ్రాయగలిగిన వ్యాస వాల్మీకి శంకరాచార్య కాళిదాస ప్రభృతులైన మహామహుల ఉపమా మొదలగు అలంకార గౌరవములతో శోభన గుణ సంపత్తులతో మిక్కిలి లలితమై అనర్థములు లేక బహుళార్థయుతమై శోభించు కవితలు కూడా నీకు నిజమైన సంతోషాన్నివ్వలేవు. అట్టి నిన్ను నేను వర్ణించడం తగిన పనేనా? అయినా తల్లి పిల్లవానికి మాటలు నేర్పునప్పుడు బాలకుడు అస్పష్టముగా, యాసలతో అపశబ్దములు ఉచ్చరించినా తల్లికి సంతోషాన్నివ్వదా? అనే ధైర్యంతో బాలకుడనైన నేను నీ ప్రేరణచేత నాకు తోచినరీతిని స్తుతించినా సంతోషించమని కోరుచున్నాను.

భక్తులయందు అపారమైన అనుగ్రహం కలిగిన మాతృదేవతవు గనుక నిన్ను స్తుతించడమే ప్రధానముగా గుర్తించి నా స్తోత్రమును స్వీకరించమని ప్రార్థిస్తున్నాను. ఈ స్తోత్రమందు కృష్ణానదీ దేవతయొక్క ముఖ్య ప్రేరణయే అని సూచించారు.

## 5

**రసజ్ఞా మే దత్తా మునినమిత దత్తాత్రిజపదే**
**ముదే తస్యాపీయం ప్రభవతి న కిం సాధు లహరీ,**
**హరీశాత్మా కృష్ణా యత ఇయ మభూద్దత్తదయితా**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

సనకాదులైన జ్ఞాననిష్ఠులగు మహా యోగిపుంగవులచేత నమస్కరించి సేవించబడు పాదయుగ్మము కలిగిన దత్తాత్రేయ గురుమూర్తికి నా నాలుక సమర్పించబడినది. అట్టి ప్రభువును వర్ణించుటయే నా జిహ్వకు స్వభావము.

ఐతే అట్టి దత్తభక్తుడవైన నీవు నన్నెందుకు స్తుతించుచున్నావని అంటే అమ్మా! నిన్ను స్తోత్రము చేయుచున్న ఈ లహరి శ్రీ దత్తాత్రేయ మూర్తికి ప్రీతిపాత్రమేనని నా నిర్ణయము. వ్యాసమహర్షి చెప్పినట్లు "కృష్ణా విష్ణుతను



స్సాక్షాత్ వేణ్యా దేవో మహేశ్వరః" శివ విష్ణు స్వరూపమైన నీవు త్రిమూర్త్యాత్మకుడగు శ్రీదత్తాత్రేయ మూర్తికి ప్రియమగుదానివి. తనకు ప్రియమైనవారిని వర్ణించునపుడు తాను సంతోషపడడం లోకధర్మమే కదా!

***"కృష్ణేయం కృష్ణరూపస్య తనుర్మమ జలాత్మికా,***
***మత్తః కృష్ణా సముత్పన్నా తత్ప్రభావం పరం విదుః"***
**- కృష్ణామాహాత్మ్యం**

జలరూపమై ప్రవహించు కృష్ణానది నారాయణుని స్వస్వరూపమేనని పరమాత్మ చెప్పియున్నారు. నారాయణ రూపమైన ఈ నదియందు శంకరుడు వేణూరూపముగా లీనమైయున్నాడు. కనుక హరిహరాత్మకమైన నది ఈ నది. ఇట్టి నదీస్పర్శ భగవత్ స్పర్శవంటిది అని నిరూపించారు.

## 6

**న చ ప్రాజ్యం రాజ్యం న చ విబుధపూజ్యం సురపదం**
**పదం పూష్ణో జిష్ణోరపి మమ న విష్ణో రభిమతమ్,**
**మతం దత్తాత్రేయ ప్రపద పరిపూతం తవ తటం**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

కృష్ణానదిని స్తోత్రము చేస్తున్నావు కదా! నీవు ఏమి కోరుతున్నావంటే ఏనుగులతో, గుఱ్ఱాలతో, ధనసంపదలతో సమృద్ధమైన ప్రజాపాలనరూపమైన రాజ్యమును నేను కోరను. దేవతలచేత కూడా పూజింపబడే ఇంద్ర, అగ్ని, వరుణ, వాయువులయొక్క స్థానములను కూడా కోరను. లోకాన్ని ప్రకాశింపచేసే లోకబంధువైన సూర్యుని స్థానము కూడా కోరను. *"ఆబ్రహ్మభువనాల్లోకాః"* అని సర్వలోకములు పునరావృత్తి కలవిగానే చెప్పబడినవి. వెనుకచెప్పిన లోకాలకంటె పునరావృత్తిరహితమైన సర్వవ్యాపకుడైన నారాయణుని స్థానమైన వైకుంఠమునూ కోరను. ఏమీ కోరనన్నానుకదా అని కోరిక లేకపోలేదు. తనను తాను అత్రిమహర్షికి

ఇచ్చుకున్నవాడు. *"అత్రేరపత్యమభికాంక్షత ఆహ తుష్టో దత్తో మయాఽహ మితి యద్భగవాన్ స దత్తః"* అని భాగవతంలో చెప్పినట్లు తనను తానుగా ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతిక తాపత్రయరహితుడైన, జ్ఞాననిష్ఠుడైన అత్రిమహర్షికి ఇచ్చుకున్నవాడు. అంటే సంతానము పన్నెండు విధములుగా ఉన్నది ధర్మశాస్త్రంలో అందులో దత్తక పుత్రుడొకడు. ఆ పుత్రులలో చేరిన దత్తక పుత్రుడు కాడు ఈయన. లోకంలో దత్తపుత్రుడికి జనకుని గోత్రము, దత్తజనకుని గోత్రము రెండు సంబంధములు ఉంటాయి. భగవంతునికి తండ్రి లేడు. కనుక ఏ గోత్రసంబంధము లేని పరబ్రహ్మ సంబంధము.

*"యత్తదద్రేశ్య మగ్రాహ్య మగోత్ర మవర్ణం"* అని శ్రుతులు చెప్పుటచేత గుణాతీతుడైన పరమాత్మ తనంతట తానే అత్రిమహర్షికి పుత్రునిగా, సాక్షాత్కరించాడు. అట్టి దత్తదేవుని క్షేత్రములు ఏ కృష్ణానదీ తటమందు శోభించుచున్నవో అటువంటి దేవాదులకు కూడా దుర్లభమైన కృష్ణానది తీరనివాస సంచారములనే కోరుచున్నా నన్నారు కవి.

శ్రీదత్తాత్రేయ క్షేత్రము లన్నీ శ్రీకృష్ణానదీ తీరమునందే ఉన్నాయి. ఔదుంబరము, నర్సోబావాడి, భిల్లవడి, కురవపురము మొదలగు సుప్రసిద్ధములైన శ్రీదత్తాత్రేయ సాక్షాత్కార స్థానములైన మహాక్షేత్రములన్నీ కృష్ణాతీరమునందే ఉన్నవి. మహానదులలో కృష్ణానదికి ఒక ప్రత్యేకత ఉంది. తాను పుష్కరపర్వముగల మహానదియై కూడా తుంగ, భద్ర, భీమనది, అమరజ మొదలగు ఎన్నో ఉపనదులు ఈ మహానదిలో లీనమవుతాయి. అదియేకాక స్వయముగా పుష్కర పర్వముగల తుంగభద్రానది ఈ కృష్ణానదిలో లీనమవుతున్నది. ఈ నది ఉపనదులైన భీమ అమరజ నదుల యొక్క సంగమస్థానమే మహాతీర్థస్వరూపము.

ఇక్కడనే కలియుగంలో ప్రసిద్ధమైన శ్రీదత్తాత్రేయ అవతారమైన నరసింహసరస్వతీస్వామి చరణులు నివసించి ఎందరో భక్తులను



అనుగ్రహించియున్నారు. ఈ స్థానమునే గంధర్వపురమని (గాణగాపూర్) వర్ణించియున్నారు. ఇట్టి కృష్ణాతీరమందు నివసించుట, సంచరించుట జీవకోటికి ఎంతో పుణ్యముచేతగాని లభించదని శ్రీవాసుదేవానంద సరస్వతీస్వామివారు ఈ లహరిలో నిరూపించారు.

## 7

**న భోగం నో యోగం న చ దురితభంగం లషతి మే**
**మనోఽరోగం గాంగం జలమపి న సాంగం శ్రుతిగణమ్,**
**న యాగం న స్వర్గం తవ సతతయోగం లషతి మే**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

అమ్మా! కృష్ణవేణీ! నా మనస్సు కామినీ భోగాదులను గానీ, యమ నియమ ఆసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణ ధ్యాన సమాధి రూపమైన అష్టాంగములు కల యోగవైభవమునుగానీ, దానివలన వచ్చు మహామహిమలను గానీ కోరదు. పాపపరిహారమును కూడా కోరదు. ఆరోగ్యమును గాని, గంగాజలమును గాని కోరదు. షడంగములతో కూడిన వేదసముదాయమును కూడా కోరదు. ప్రకృతి వికృతి రూపమైన యజ్ఞాదులను కూడా కోరదు. ఆ యాగముల ఫలభూతములైన స్వర్గాదులను కూడ కోరదు. ఇవి ఏమి కోరని నా మనస్సు నీ నదీతీర్థమునందు స్నానపానాదులను ఎల్లప్పుడూ కోరుతుంది. కృష్ణానదీ స్నానాదులచేతనే సర్వపాపపరిహారము, సకల పురుషార్థప్రాప్తి సిద్ధించునని కవియొక్క అభిప్రాయము.

## 8

**మనః కృష్ణే త్వదపసరతి క్వాఽపి న కలౌ**
**మలౌఘఘ్నీతి ఘ్నీభవతి భవతీ హేతి సతతమ్,**

**సువిశ్వస్తం గ్రస్తం జగతి గతిదే సాధనచయాత్**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

అమ్మా! శ్రీకృష్ణే! నా మనస్సు ఎక్కడా ఏ నదిదగ్గర ఆసక్తము కాదు. ఎందుకంటే ఈ లోకంలో విశేషించి కలియుగంలో నీవే సర్వపాపములను పోగొట్టుదానివి. నిన్ను ఆశ్రయించినవారికి అతివృష్టి, అనావృష్టి మొదలగు ఈతిబాధలుండవు. *"అతివృష్టి రనావృష్టిః మూషకాశ్శలభా శ్శుకాః, స్వచక్రం పరచక్రం చ సప్తైతా ఈతయః స్మృతాః".* ఈతిబాధలనుగా చెప్పియున్నారు. శ్రీకృష్ణానదీ సంసేవనముచేత సర్వారిష్టములు తొలగ గలవు. అట్టి దృఢమైన విశ్వాసము ఉన్నది నాకు.

లోకంలో ఉన్నటువంటి సాధనములు ఐహిక ఆముష్మికములను నీ అనుగ్రహమువలన వలె దేనివలననూ సాధింపబడవు.

## 9

**మహాభంగా గంగా యది దురిత భంగాత్ర కథితా**
**మతాపీహత్వత్తః కథమధికతామేతి విమతా,**
**హరే స్స్వాంఘ్ర్యుద్భూతా త్వమివ నను మూర్తా హరితనుః**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

సముద్రమువంటి ఉత్తుంగ తరంగాలు కలది. సమస్తజీవకోటి పాపాలను భేదించగలది. జీవులయందు వ్యాపించిన దోషాలనేవి – నేను కర్తను, నేను భోక్తను అని వదలనుటువంటి సంసారమునకు బీజభూతములైనవి అవిద్య, కామము, కర్మ అనునవి. ఈ దోషములు కూడా గంగాసేవనముచేత తొలగిపోగలవు. *"గంగా గంగేతి యో బ్రూయాత్ యోజనానాం శతైరపి, ముచ్యతే సర్వపాపేభ్యో విష్ణులోకం స గచ్ఛతి".* గంగానదికి నూరు యోజనముల దూరములోనున్నా 'గంగా గంగా' అని ఉచ్చరించినంత మాత్రముచేతనే సర్వపాతక విముక్తుడై విష్ణులోకమునకు చేరగలడు అని



ప్రసిద్ధియున్నది. *"స్రోతసామస్మి జాహ్నవీ"* అని భగవంతుని విభూతి అని కూడా ప్రసిద్ధి చెందినది గంగానది. ఇన్ని మహత్త్వములున్నప్పటికీ హరియొక్క పాదకమలమునుంచి పుట్టినది.

***హరామ్యఘం హి స్మర్తౄణాం హవిర్భాగం క్రతౌ యథాః***
***వర్ణో హి మే హరిర్యస్మాత్ తస్మాద్ధరిరితి స్మృతః.***

అని నిరుక్తివలన నేను సర్వపాపములను హరించెదను అన్నారు. సర్వక్రతువులయందు హరిర్భోక్తగాన హరితవర్ణుడు గాన సర్వపాపహరుడయిన నారాయణుని హరి అన్నారు.

*"విష్ణుపాదాబ్జ సంభూతా గంగా త్రిపథగామినీ"* అనిపురాణ ప్రసిద్ధి. కానీ సాక్షాత్ నీవలె నారాయణుని స్వరూపము కాదుగదా! సాక్షాత్ నీవే మహావిష్ణుస్వరూపమని నిర్ణయము. సాక్షాత్ నారాయణుడైన కృష్ణానదికంటె పాదమునుంచి పుట్టిన గంగ ఎలా అధికమవుతుంది.

## 10

**హరేర్గంగాంఘ్ర్యబ్జాఽభినవబిసవల్లీభవతు వాఽ**
**ధితిష్ఠత్వీట్ఛీర్షం స్రగివ చ పతాకేవ సుతరామ్,**
**ప్రకామం ముక్తేర్న త్వమివ భవతి శ్రీహరితనుః**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

***"అభినవబిసవల్లీ పాద పద్మస్య విష్ణోః***
***పురమథన మౌళేః మాలతీపుష్పమాలా***
***జయతి జయపతాకా కాఽప్యసౌ మోక్షలక్ష్మ్యాః***
***క్షపిత కలికళంకా జాహ్నవీ నః పునాతు"***

అని వాల్మీకి గంగానదిని స్తుతించి ఉన్నాడు. అట్టి గంగ కృష్ణానది కంటె ఎందుకు అధికమైనది కాదు? అంటే – గంగానది నారాయణుని

పాదకమలమునకు వెలువడిన తామరతీగకావచ్చు. సర్వేశ్వరుడైన శంకరునియొక్క శిరస్సునకు అలంకారభూతమైన మాలతీపుష్పమాల కావచ్చు. అలాగే యథేష్టముగా సాయుజ్య ముక్తికి పతాకవంటిది కావచ్చు. అయినా నీవలె సాక్షాత్తు నారాయణుని స్వరూపము కాదుకదా! కాన అధికురాలు ఎలా అవుతుంది?

రఘువంశంలో సగరుడనే ప్రసిద్ధ చక్రవర్తి ఉన్నాడు. ఆయనకు వైదర్భీ, శైబ్య అనే ఇద్దరు భార్యలు ఉన్నారు. అందులో శైబ్య అనుదానికి అసమంజుడనే కుమారుడు కలిగాడు. వైదర్భి అనునామె మహర్షి అనుగ్రహంతో సంతానమునకు ఆశీస్సుపొందినదైనా శంకరుని ఆరాధించినది. ఆమె ప్రసూతి సమయంలో అతి ప్రసవవేదనతో గర్భతుంబము (పిండము) ప్రసవించినది. ఆమె అమితవేదనను పొందుతూండగా –

*"శంభుర్బ్రాహ్మణ రూపేణ తత్సమీపం జగామ హ,*
*చకార సంవిభజ్యైతత్ పిండం షష్టిసహస్రధా."*

– దేవీ భాగవతం

భక్తానుగ్రహపరుడైన శంకరుడు బ్రాహ్మణరూపము ధరించి వచ్చి అరవై వేల ముద్దలనుగా చేసి కుండలలో నేతిని నింపి అందులో ఈ ముద్దలను వేసి వెళ్లాడు. క్రమముగా ఆ గర్భపిండశకలములు సగరునికి అరువదివేల మంది కుమారులుగా పుట్టారు. అసమంజుడు ప్రజలకు బాధలు కల్పించడంవల్ల సగరుడు అసమంజసుని దేశాన్నించి బహిష్కరించాడు. అసమంజునికి కుమారుడు కలిగాడు. అంశుమంతుడని పేరు అతనికి. తరువాత కొంతకాలమునకు సగర చక్రవర్తి అశ్వమేధయాగముచేయగా యాగమునకు వదలిపెట్టిన గుఱ్ఱాన్ని ఇంద్రుడు మాయారూపంతో అపహరించి పాతాళలోకములో మహాయోగి అయిన కపిలమహర్షి తపస్సుచేసే చోట వదిలాడు. యజ్ఞాశ్వాన్ని వెతకమని తండ్రిచేత



ఆజ్ఞాపింపబడి భూమినంతటినీ త్రవ్వి సగరపుత్రులు అరవై వేలమంది కపిల మహర్షి సమీపంలో ఉన్న యజ్ఞాశ్వాన్ని చూశారు. మహర్షియే యజ్ఞాశ్వాన్ని అపహరించాడని ఆయన మీద దుడుకుతనం చేయబోగా వాసుదేవ స్వరూపుడగు కపిలమహర్షి యోగాగ్నిచేత ఈ అరవై వేలమందిని భస్మపు రాశులుగా చేశాడు. తరువాత అంశుమంతుడు వచ్చి ఈ యాజ్ఞాశ్వాన్ని చూచి భస్మపురాశులయిన పితృదేవతలను చూచి వారికి తర్పణాదులు చేయ ప్రయత్నించగా గరుత్మంతుడు నివారించి మహర్షిశాపదగ్ధులుగాన స్వర్గమందున్న గంగను భూలోకానికి తెచ్చి ఈ భస్మరాశులను సోకితేగాని వీరికి సద్గతిలేదు అని నివారించాడు. గరుత్మంతుని ఉపదేశముతో యాజ్ఞాశ్వాన్ని తీసుకువెళ్లి సగరుని యాగమును పూర్తిచేయించాడు.

తరువాత సగరుడు, అంశుమంతుడు, దిలీపుడు గంగను దించలేకపోయారు. తరువాత భగీరథుడు సంతానములేనివాడైనా రాజ్యభారము మంత్రులకు అప్పగించి తీవ్రమైన తపశ్చర్యతో నారాయణుని ఆరాధించగా లోగడ గంగానదికి సరస్వతివలన భూలోకంలో భరతఖండంలోకి దిగునట్లు శాపం ఉండటంవలన గంగను భూలోకానికి వెళ్లి సగరపుత్రులను తరింపచేయమని నారాయణుడు ఆజ్ఞాపించాడు. భగీరథుడు గంగను ప్రార్థించాడు. గంగ లోకోద్ధరణకొరకై గోలోకమందు రాధాకృష్ణుల అంశతో గంగగా నిర్మాణమైనది.

*"సా ఏవద్రవరూపా సా గంగా గోలోక సంభవా,*
*రాధాకృష్ణాంగసంభూతా భుక్తిముక్తి ఫలప్రదా."*

– దేవీభాగవతం

రాధాకృష్ణుల అంశతో ఆవిర్భవించిన గంగ భోగమోక్ష ఫలప్రదాత్రిగా, నారాయణుని చరణకమలమునుంచి ఆవిర్భవించినది. నారదుడు నారాయణుని అడిగాడు, నీ చరణకమలమునుంచి గంగ ఎలావచ్చిందని. ఆ కథ చెప్పాడు నారాయణుడు నారదునికి.

*"పురా బభూవ గోలోకే సా గంగా ద్రవరూపిణీ,*
*రాధాకృష్ణాంగ సంభూతా తదంశా తత్స్వరూపిణీ."*

**– దేవీభాగవతం**

పూర్వకాలంలో గోలోకమందు రాధాకృష్ణుల శరీరంనుంచి వారి అంశభూతమై ఆవిర్భవించి భోగ మోక్షఫలములను జీవకోటికి ప్రసాదింపచేయుటకై సుందరాతిసుందరమై, నవయౌవన స్ఫూర్తితో, శరత్కాలచంద్రబింబమువంటి ముఖమండలముతో, దివ్యశోభతో శ్రీకృష్ణుని పార్శ్వభాగమందు వచ్చి నిలిచినది. శ్రీకృష్ణుని ప్రక్కన ఉన్న రాధాదేవికి ఈమెను చూచి కోపం వచ్చింది. ఆ కోపమునకు గంగ భయపడినదై జలరూపమును ధరించి శ్రీకృష్ణుని చరణకమలములో ప్రవేశించి శ్రీకృష్ణుని శరణుపొందినది. యోగసామర్థ్యముచేత జలరూపమునంతా ఉపసంహరించినది. అంతటితో జగత్తులో జలభాగము నశించి అందరికీ గొంతులు ఎండిపోవడం మొదలుపెట్టింది. జలజంతువులన్నీ నశిస్తున్నాయి. అప్పుడు దేవతలు భీతులై పరమాత్మను శరణుపొందారు. పరమాత్మ అభిప్రాయాన్ని గుర్తించి రాధాదేవిని స్తుతిచేశారు.

అమ్మా రాధాదేవీ! మీ రాధాకృష్ణుల అంశభూతయై గంగ అవతరించినది. ఆ కారణముగా నీకు గంగ కుమార్తె. ఆమెను నీవు కుమార్తెగా స్వీకరించు.

*"బ్రహ్మణో వచనం శ్రుత్వా స్వీచకార చ సస్మితా,*
*బహిర్బభూవ సా కృష్ణపాదాంగుష్ఠనఖాగ్రతః."*

**– దేవీభాగవతం**

ఇలా బ్రహ్మచేత స్తుతించబడిన రాధాదేవి గంగను కుమార్తెనుగా స్వీకరించినది. అప్పుడే శ్రీకృష్ణస్వామియొక్క పాదముయొక్క బొటనవ్రేలి గోటినుంచి ఉదకరూపముగా గంగ బయటకు వచ్చినది.



*"గోలోకే చ స్థితా గంగా వైకుంఠే శివలోకకే,*
*బ్రహ్మలోకే స్థితాన్యత్ర యత్ర యత్ర పురస్థితాః*
*తత్రైవ సా గతా గంగా చాజ్ఞయా పరమాత్మనః*
*నిర్గతా విష్ణుపాదాబ్జాత్ తేన విష్ణుపదీస్మృతా."*

**– దేవీభాగవతం**

గోలోకంలో ఉన్న గంగ వైకుంఠ శివలోక బ్రహ్మలోకం మొదలైన పూర్వమందున్న స్థానము లన్నిటియందు ప్రవహించినది. విష్ణుపాదంనుంచి బయలుదేరుటచేత గంగకు విష్ణుపదీ అను పేరు వచ్చినది. అనగా విష్ణుస్వామి యొక్క అంశభూతయై విష్ణుపాదంనుంచి గంగవచ్చిందన్న మాట. కానీ కృష్ణానదియైతే సాక్షాత్ విష్ణుశరీరమే. ఈ మాటనే నారదుడు ఋషులకు చెప్పి ఉన్నాడు.

*"ఏవమేషా జగన్మాతా కృష్ణా విష్ణుతనుః స్వయమ్*
*మాహాత్మ్య మస్యాస్త్వఖిలం అనేకం కో వదిష్యతి."*

**– కృష్ణామాహాత్మ్యం**

జగత్తులయొక్క స్థితికొరకై సాక్షాత్ విష్ణుశరీరమే కృష్ణానదిగా అవతరించినది. ఈ కృష్ణామాహాత్మ్యమును సంపూర్ణముగా ఎవరు చెప్పగలరు?

## 11

**గతే జీవే కన్యాం జగతి బహుమాన్యాం శిఖరిణీ**
**హసహ్యే త్వాం ధన్యాం జనని భగినీ వామరసరిత్,**
**సమాగత్యాప్యబ్దం పరమనియమాత్ తిష్ఠతి ముదా**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

తల్లీ శ్రీ కృష్ణవేణీ! బృహస్పతి కన్యారాశిని ప్రవేశించగా లోకమందు పరమ ధన్యవైన సహ్యపర్వతమందున్న నిన్ను చూచుటకై గంగ తాను

పాపాత్ముల పాపములను పోగొట్టడం వల్ల తనకు సంచితమైన పాపమును పోగొట్టుకొనుటకై సోదరిని చూడటానికి వచ్చినట్లు అనే నెపముతో త్రికరణ శుద్ధిగా నీ దగ్గరకు వచ్చి బృహస్పతి కన్యారాశిలో ఉన్నంతవరకు పరమ నియమముతో నీ దగ్గరే ఉండిపోతుంది. ఇప్పటికీ సహ్యాపర్వతంమీద కృష్ణాపుష్కర సంవత్సరకాలము ఒక కుండమందు. గంగ ప్రవహిస్తుంది. పుష్కర సంవత్సరం దాటితే మరల కనబడదు. నేటికీ ఇది దృష్టాంతమే.

మహర్షులు కుమారస్వామిని ప్రార్థించగా కృష్ణామాహాత్మ్యం కుమారస్వామి ఋషులకు చెప్పినట్లు స్కాందమందు కథ. పూర్వమందు దివోదాసుడనే రాజు కాశీపట్టణాన్ని పరిపాలించేవాడు. దివోదాసుడి పరిపాలన సమయంలో హైహయరాజు దివోదాసుడి రాజ్యం అపహరించాడు. ఆ కారణంగా దేవతలు, ఋషులు కాశీ వదిలారు. ఈ ఋషులు తీర్థయాత్రకై దక్షిణ దిక్కుకు బయలుదేరారు. ఆ యాత్రలో సహ్యాపర్వతానికివచ్చారు. దత్తాత్రేయస్వామివారి సన్నిధిలో కృష్ణవేణి ప్రవహిస్తున్నది. అక్కడకు చేరి ఋషులందరూ శ్రమ పోగొట్టుకున్నారు. చాలా ఆనందించారు. ఇక్కడనే తపస్సు చేసుకుందామని తపస్సును ప్రారంభించారు. ఆ తపస్సులకు సంతోషించిన నారాయణుడు ప్రత్యక్షమై వరమడుగగా ఋషులు ప్రార్థించారు. నీ చరణకమలమందు వచ్చిన గంగ ఈ కృష్ణానదితో కలసి సమస్త జీవులను ఉద్ధరించుగాక అనికోరగా కన్యారాశిలో బృహస్పతి సంవత్సరములకువచ్చే పుష్కరకాలమందు బృహస్పతి కన్యలో ప్రవేశించగా సహ్యాపర్వతమందు ఉత్తరదిక్కుగా గుండమందు గంగ ఆవిర్భవించి కృష్ణతో కలుస్తుంది. ఇది పుష్కరకాలమందుండే విశేషము కృష్ణానదీ మాహాత్మ్యములో చెప్పియున్నారు. ఇదే కుమారస్వామి ఋషులకు చెప్పియున్నారు.

*"యఃకృష్ణ వేణీంమనుజఃప్రయాతికన్యాగతేదేవగురౌప్రయత్నాత్,*
*స చాయురారోగ్యమహావిభూతిం స ధర్మసిద్ధిం లభతే మనుష్యః."*

**- కృష్ణామాహాత్మ్యం**



బృహస్పతి కన్యారాశియందు ప్రవేశించగా ఈ పుష్కర మహాపర్వమందు ఏ మనుష్యుడు ప్రయత్నించి కృష్ణాసేవకు వెళతాడో, అతనికి ఆయుష్యము, ఆరోగ్యము, మహదైశ్వర్యము కలుగుటేకాక ధర్మస్థితిని కూడా పొందగలుగుతాడు.

*"తస్మాత్ సర్వప్రయత్నేన కన్యారాశిగతే గురౌ,*
*కృష్ణవేణీం సమాసాద్య ప్రాయశ్చిత్తం చరేత్సుధీః."*

**- కృష్ణామాహాత్మ్యం**

కృష్ణాపుష్కర పర్వకాలమందు (ముఖ్యంగా పుష్కరప్రారంభమునుంచీ 12 రోజులు ముఖ్య పర్వంగా అనుకున్నా, సంవత్సరమంతా పుష్కరకాలమే) ప్రయత్న పూర్వకముగా కృష్ణవేణీనదీ సన్నిధానమునకు చేరి ప్రాయశ్చిత్తాది కర్మలు (తీర్థవిధి మొదలైనవి) జరుపుకున్నవాడికి విశేషఫలమని ప్రమాణము చెప్పుచున్నవి. ఆ విధులే క్రింద చూపింపబడుచున్నవి.

*"ముండనం చోపవాసంచ హిరణ్య శ్రాద్ధమేవ చ,*
*కరిష్యంతి నరా భక్త్యా పితౄనుద్ధారయంతి తే,*
*కన్యాగతే గురౌయస్తు తీర్థశ్రాద్ధం కరోతి వై*
*పితరో ద్వాదశాబ్దం తు తృప్తిం యాంతి న చాన్యథా."*

**- కృష్ణామాహాత్మ్యం**

ఎవరు కృష్ణా పుష్కరకాలమందు భక్తితో కృష్ణాతీరమునకు చేరిముండనము (క్షురకర్మ), ఉపవాసము, హిరణ్యశ్రాద్ధము జరుపగలరో వారి పితృదేవతలను వారు ఉద్ధరించినట్లు అవుతుంది. బృహస్పతి కన్యారాశియందు ఉండగా ఎవరు తీర్థశ్రాద్ధము శ్రద్ధతో చెయ్యగలరో వారి పితృదేవతలు ఈ తీర్థవిధి ఫలముచేత 12 సం.లు (మరల కృష్ణాపుష్కరము వచ్చువరకు) సంపూర్ణమైన సంతృప్తి పొందగలరు.

*"తీర్థోపవాసః కర్తవ్యః శిరసో ముండనం తథా,*
*శిరోగతాని పాపాని యాంతి ముండనయోగతః."*

**– కాశీఖండం**

బృహస్పతి కన్యాగతుడైన పుష్కరమహాపర్వమున కృష్ణాతీరమునకు వెళ్లి ప్రాయశ్చిత్తాంగముగా క్షేత్రోపవాసం చెయ్యాలి. క్షురకర్మ చేయించుకోవాలి. మానవుల పాపాలన్నీ శిరస్సుమీద ఉన్న కేశముల నాశ్రయించి ఉంటాయి. ఈ ముండనముతో ఆ పాపములు తొలగిపోతాయి. అప్పుడుగాని పరిశుద్ధుడు కాలేడు. ఇప్పటికాలంలో పాశ్చాత్య సంసర్గంవలన తలమీద వెంట్రుకలు పోతే సౌందర్యం తగ్గిపోతుందని భ్రమపడతారు. ఉపనయనంలో వటువుకు కూడా పంచశిఖలు పెట్టనటువంటి కాలమిది. దీనికి కారణం శాస్త్రవిధిని గుర్తించకపోవడమే. ధర్మశాస్త్రము ఇలా చెప్పుచున్నది.

**"యాని కాని చ పాపాని బ్రహ్మహత్యా సమాని చ,**
**కేశానాశ్రిత్య తిష్ఠంతి తస్మాత్ కేశాన్ వపామ్యహమ్."**

ఈ మంత్రం చదువుచూ శిరోముండనం చేయించుకోవాలి గృహస్థుడు. "శిఖా కక్షోపస్థ వర్జ్యం కేశశ్మశ్రులోమనఖాని వాపయిత్వా, క్షౌరం తు దక్షిణకర్ణ మారభ్య హనుశ్మశ్రువామకర్ణమూల శిరోభాగస్థకేశకృంతన సఖచ్ఛేదమేవ" అని నారాయణభట్టీయంలో చెప్పబడినది. గడ్డము, చెంపలు, శిరస్సు, మీసములు ముఖ్యముగా ముఖభాగమునకే చెప్పబడిన క్షౌరము. ముండము అనగా శిరస్సు అని అర్థము. కనుక శిరోభాగమునందు పాపములు ఆశ్రయించి ఉంటాయి. ఆ తీరమందు నివసించువారికి ఈ నియమం లేదు.

**"ముండనం చోపవాసశ్చ గోదాయాం సింహగే గురౌ,**
**కన్యాగతే తు కృష్ణాయాం న తు తత్తీరవాసినామ్."**



బృహస్పతి సింహరాశిలో నుండగా గోదావరీ తీరమున తీర్థవిధులు జరుపుకునేవారు, బృహస్పతి కన్యారాశియందు ప్రవేశించగా కృష్ణానదీ తీరమున తీర్థవిధులు జరుపుకునేవారు ముండనము, ఉపవాసము చేయవలెను. తీరమందు నివసించేవారికి ఈ నియమం లేదు.

'యావన్ముండన పర్యంతం తావత్త్వం తస్య సూతకం'. క్షుర కర్మతోగాని శుచిత్వము కలుగదు. అనగా విధానము ఇలా ఉన్నది. యాత్రకు వెళ్ళినవారు ముందు స్నానం చేసి సంకల్పము చెయ్యాలి. గణపతిపూజ, స్వస్తివాచనం, నాందీశ్రాద్ధం చెయ్యాలి. కృష్ణాసన్నిధికి చేరిన తరువాత దక్షిణ లిచ్చి నదికి సాష్టాంగ నమస్కారం చెయ్యాలి. మంత్రములు లేకుండా స్నానం చెయ్యాలి. తరువాత సకలపాపక్షయార్థం అని ప్రాయశ్చిత్తాంగముగా క్షురకర్మకు సంకల్పం చెయ్యాలి. తరువాత పరిషత్ దక్షిణ బ్రాహ్మణ ప్రదక్షిణ నమస్కారములు చెయ్యాలి. అపసవ్యం చేసుకొని పితృదేవతల సంకల్పం చేసుకోవాలి. సవ్యం చేసుకొని పెద్దల ఆజ్ఞతీసుకొని క్షురకర్మ జరిపించుకోవాలి. తరువాత స్నానం చేసి సంకల్పంతో ప్రాయశ్చిత్తార్ఘ్యములు చెయ్యాలి. (సువాసినీ స్త్రీలు పసుపురాసుకొని సంకల్పం చెయ్యాలి) స్నానాంగతర్పణం చేసి తెల్లని వస్త్రము ధరించివారికి అలవాటైన తిలకధారణం చేసి దేవ ఋషి పితృతర్పణం చేసి వపనాంగముగా హిరణ్య శ్రాద్ధం చెయ్యాలి. ప్రాయశ్చిత్తాంగంగా దశదానములు చెయ్యాలి.

**"గో భూ తిల హిరణ్యాజ్య వాసో ధాన్యగుడాని చ,**
**రౌప్యం లవణ మిత్యాహుః దశదానాన్యనుక్రమాత్"**

ఈ పదిదానములు (గోదానం, భూదానం, తిలదానం, సువర్ణం, నెయ్యి, వస్త్రము, ధాన్యము, బెల్లము, వెండి, ఉప్పు) వరుసగా చేయవలెను. దక్షిణ ఇచ్చి తరువాత బృహస్పతికి కృష్ణవేణికి ప్రతిమలు చేయించి యథాశక్తిగా పూజించాలి. ప్రతిమలు వెండితో చేయడం విశేషం. అలాగే ఇంద్రుడికి, బ్రహ్మకు ప్రతిమలు చేయించి విధియుక్తముగా పూజచేయాలి.

*"అర్ఘ్య మావాహనం చైవ ద్విజాంగుష్ఠనివేశనమ్,*
*తృప్తి ప్రశ్నం చ వికిరం తీర్థశ్రాద్ధే వివర్జయేత్"*

అర్ఘ్యము, ఆవాహనము, పాదాంగుష్ఠము తడిపి చల్లుకొనుట శిరస్సుపైన, తృప్తిప్రశ్న, వికిరపిండము తీర్థశ్రాద్ధమందు వదలవలెను.

*"యాత్రోత్సవ విధిం కృత్వా స్వస్థానే గమనం చరేత్,*
*గృహే కృష్ణవేణీ పూజాం కుర్యాత్ స్వైర్బాంధవైస్సహ.*
*దంపతీ భోజయేత్పశ్చాత్ బ్రాహ్మణాంశ్చ స్వశక్తిః,*
*యాత్రాయాః పరిపూర్త్యర్థం అన్యథా నిష్ఫలా భవేత్"*

తన ఇంటికి చేరి కృష్ణవేణీ పూజ, దంపతీపూజ, జరుపుకోవలెను. ఇది తీర్థవిధికి చూపించిన విధానము. మహాభారత చరిత్రలో 12 సం॥ల వనవాసం జరుపుతూ అందులో చివర సం॥రం॥ కృష్ణాతీరంలో నివసించారు. దానితో వ్రతం పూర్తయినది పాండవులకు.

*"వర్షం తత్ర స్థితో రాజా యావత్కన్యాగతే గురౌ,*
*ద్వాదశాబ్దవ్రతం పూర్ణం తతో భద్రమవాప సః"*

**- కృష్ణామాహాత్మ్యం**

ఈ సంవత్సరము వారక్కడ నివసించినచోట శివలింగమునకు భద్రేశ్వరుడనే ప్రసిద్ధి వచ్చినది. పాండవులకు భద్రము అనగా మంగళము. ఈ స్థానము నాసిక్ ప్రాంతంలో ఉన్నది. అలాగే ఈ తీరములో కృష్ణానదీ సన్నిధిలో శ్రీ దత్తాత్రేయ శ్రీపాద శ్రీవల్లభ శ్రీనృసింహ సరస్వతీ భగవానుడు పాదుకారూపముగా ప్రసిద్ధముగా ఆరాధింపబడుచున్నారు. ఈ నర్సోబావాడీ అని పిలువబడు ఈ క్షేత్రము శ్రీ కృష్ణాతీరమునకు హృదయస్థానంగా చెపుతారు. ఇక్కడనే ఒక సాధ్వీమతల్లికి మరణించిన పుత్రుని శ్రీ దత్తాత్రేయ గురుమూర్తి బ్రతికించారు. అనంతమైన కృష్ణానదీమాహాత్మ్యము శ్రీ దత్తాత్రేయ అనుగ్రహప్రభావము వర్ణించుటకు, వివరించుటకు ఎట్టివారికి శక్తిచాలదు.



## 12

**మహాజంబుద్వీ పే వృజినహర తీర్థాని వరదే**
**సమాయాంతి త్వాం తు త్రివిధమలదే తాని పరదే,**
**తదా త్వత్స్నానాదేః ఫలమసి న వక్తుం ప్రభురజో**
**నమః శ్రీ కృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

పుష్కర సంవత్సరం కృష్ణానది దగ్గరకు ఒక్క గంగానది మాత్రమే కాదు అన్ని తీర్థములు ఆ నదియందు వచ్చి చేరుతాయి. అమ్మా కృష్ణవేణీ! భక్తులకు కోరిన కోరికలిచ్చే దానివి నీవు. కేవలం కోరికలేకాదు, ముక్తిని కూడా ఇవ్వగలదానివి. మోక్షమునకు ప్రతిబంధకములైన మూడు విధములైన కాయిక, వాచిక, మానసిక పాపములను పోగొట్టేదానివి. జంబూద్వీపమందు మూడున్నరకోట్ల సంఖ్య కలిగిన పాపములను పోగొట్ట గలిగిన సమస్త తీర్థములు సంవత్సరకాలము కృష్ణానదియందు ఆ తీర్థములు ఉండగలవు. ఇక్కడ ఒక చిన్న అందమున్నది. అన్ని తీర్థములు కృష్ణానదియందు చేరుతాయి గాని కృష్ణానది. ఏ నది వద్దకు చేరదని అర్థము.

అమ్మా కృష్ణవేణీ! ఈ పుష్కర మహాపర్వంలో నీయందు స్నానం చేసి నిన్ను చూసి నిన్ను స్పృశించినా నీ దివ్య ఉదకాన్ని గ్రహించినా దాని ఫలములు బ్రహ్మకూడా వర్ణించలేడమ్మా, ఇతరులకు శక్తి ఎక్కడిది?

## 13

**పితౄనుద్దిశ్యైకం వితరతి నివాపాంజలి మయే**
**మనుష్యయస్త్వయ్యగ్రే సకలపితరోఽస్య ద్రుతరయే,**
**గతిం యాంతి శ్రాద్ధాదపి చ పునరావృత్తి రహితాం**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

మహా వేగప్రవాహం కలిగిన ఓ తల్లీ! సాధారణమైన మనుష్యుడు పితృదేవతల నుద్దేశించి వారి పేరు స్మరించి నీ యందు తిల తర్పణములను

చేయగలిగితే భక్తులకు పరమఫల మిచ్చే ఓ తల్లీ ఆ తర్పణము చేసినవారి పితృదేవతలందరూ ఉత్తమ సద్గతులనుపొందగలరు. శ్రద్ధతో ఇచ్చునది గనుక శ్రాద్ధమంటారు. తీర్థ శ్రాద్ధమే పెట్టగలిగితే పునరావృత్తి రహితమైన పితృదేవతలయొక్క చిరలోక లోకములయొక్క గతిని పొందగలరు. శీఘ్రప్రవాహము అనుటచేత కృష్ణవేణీనది శీఘ్రముగా ఫలమిస్తుందని కూడా గమనించవచ్చు. పితృదేవతలనగా శాస్త్రమందు *"తాతాంబాత్మభగిన్యపత్య ధవయుగ్జాయా పితా సద్గురుః శిష్యాప్తాః పితరో మహాలయగయాతీర్థే తథా తర్పణే"* తండ్రి, తల్లి, తన సోదరి, సంతానము, మేనల్లుళ్లు, ఆత్మపత్ని, మామ, సద్గురువు, శిష్యులు, ఆప్తులు మహాలయం పెట్టేటప్పుడు, గయలో పిండప్రదానమందు, తీర్థ విధులయందు అలాగే తర్పణమందూ వస్తారు. వీరి నామ గోత్రములను గ్రహించి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు శర్మ, వర్మ, గుప్త, దాసులనే పేర్లు గ్రహించడం. ఇక్కడ కొంచెం మతభేదమున్నది. ప్రయోగమందు అనగా (వాడుకలో) ముందు పేరు, తర్వాత గోత్రము, సూత్రకారుని మతమందు ముందు గోత్రము తర్వాత పేరు ఉచ్చరించాలి. పితృపితామహ, ప్రపితామహులకు వసు, రుద్ర, ఆదిత్య రూపములను ఉచ్చరించాలి. ఏకోద్దిష్టమందు ఒక్క వసురూపమే. పితృదేవతలకు ఎప్పుడిచ్చినా మూడుసార్లు ఉదకం వదలాలి.

పూర్వం పరశురాముడు 21 మార్లు క్షత్రియజాతిని సంహరించి ఆ క్షత్రియ రక్తంతో పితృతర్పణాలు చేశాడు. దానివల్ల వచ్చిన మహాపాపాన్ని పోగొట్టుకోడానికి మార్గం దొరక్క తన పితృదేవతలను ప్రశ్నించాడు. నేను చేసిన ఈ మహాపాపాన్ని ఎలా పోగొట్టుకోవాలా అని. అప్పుడు ఆ పితృదేవతలు పరశురాముడికి చెప్పారు. కృష్ణవేణీ నదియొక్క తీరమందు రామగయ అనుపేరు గలిగిన రామలింగస్వామివారి అగ్రభాగమందు ఒక తీర్థమున్నది. (కృష్ణానదిరేవు) అక్కడనే తారకమను పేరుగలిగిన రామపాదమున్నది. సంసారశోకముతో సంతప్తులైనవారికి తరింప చేయుస్థానమన్నమాట.



*"యత్ర చాయం దశరథో వాలుకాపిండముత్తమమ్,*
*సీతా హస్తగతం ప్రాప్య లేభే పదమనుత్తమమ్."*

**- కృష్ణామాహాత్మ్యం**

ఆ, స్థానమందు సీతాదేవియొక్క హస్తముతో ఇసుక పిండముగా చేసి దరశరథునికి అర్పించుటతో దశరథుడు ఉత్తమగతిని పొందాడని పరశురామునకు పితృదేవతలు చెప్పారు. అప్పుడు పరశురాముడు ఆ స్థానానికి వెళ్లి

*"పితౄన్ సంతర్ప్య విధివత్ జామదగ్న్యః ప్రతాపవాన్,*
*యయౌ స్వధామ సహసా ఆనందితవిభావనః."*

**- కృష్ణామాహాత్మ్యం**

పరశురాముడు అక్కడికి వెళ్ళి పితృదేవతలకు తర్పణం చేసి ఆనందము పొందినవాడై స్వస్థానమునకు వెళ్లాడు. ఆ తర్పణప్రభావంతో పితృదేవతలు సంతృప్తులై మోక్షం పొందారు. ఈ స్థానము శ్రీ క్షేత్రనర్సోబావాడీకి దక్షిణంగా మైలుదూరంలో తాక అనే గ్రామం ఉన్నది. ఆ గ్రామం నుంచి 1 మైలు లోపలికి వెళ్లితే కృష్ణాతీరమందు రామలింగ నామముతో ఒక దివ్య స్థానమున్నది. అక్కడ రామపాదమున్నది. ఇక్కడనే పరశురాముడు పితృదేవతలకు తర్పణాదులను చేశాడు. ఇక్కడనే రామచంద్రమూర్తి యజ్ఞాలు చేసినట్లు కూడా చెపుతారు. ఆయజ్ఞభస్మము ఇప్పటికీ భక్తులు గుర్తిస్తూ ఉంటారు. ఇట్టి మహాక్షేత్రమునకు సన్నిధి కృష్ణాతీరం.

## 14

**మహాపాప్యాకల్పం యది విధివశాత్ దుర్గతిగతో**
**వృషోత్సర్గాత్ సోఽపి ద్రుత మిహ హి నారాయణబలేః,**
**త్రిపిండిశ్రాద్ధాద్యా వ్రజతి సుగతిం దుర్లభతరాం**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

మహాపాపములు చేసినవారు ఐదుగురని శాస్త్రములందు చెప్పబడినది.

*"బ్రహ్మహా, హేమ హారీ చ సురాపో గురుతల్పగః,*
*మహాపాతకిన స్త్వేతా తత్సంసర్గీ చ పంచమః."*

పాపములలో తీవ్రమైన పాపములను లెక్కించి పంచ మహాపాపములని అన్నారు. బ్రహ్మహత్య, బంగారము దొంగిలించుట, మద్యపానముచేయుట, గురుస్త్రీ సాంగత్యము పొందుట, ఈ నలుగురిలో ఎవరితోనైనా సాంగత్యము చేయట – ఈ ఐదు పాపముల లక్షణములు. ఈ పాపములచేత నరకాన్ని పొందేవాడైనా వారి పుత్రులచేత అనుష్ఠించబడిన నారాయణబలివలన (కృష్ణాతీరమందు చేసిన) ఎంతో పుణ్యముచేత కూడా లభించని పునారావృత్తి రహితమైన శాశ్వత మోక్షమును పొందగలడు.

*"ప్రేతదోషే ప్రకర్తవ్యో నారాయణ బలిర్విధిః,*
*ప్రేతశ్రాద్ధం త్రిపిండాఖ్యం విష్ణోస్తర్పణ మేవ చ."*

కనుక పుణ్యమైన నదీ తీర్థమందు వృషోత్సర్జనము కానీ, నారాయణబలి కానీ, త్రిపిండాఖ్య శ్రాద్ధము కానీ జరిపినట్లైతే సర్వపాపరహితుడై జీవి ప్రేతత్వవిముక్తిని పొంది సుగతిని పొందగలడు.

*"న కరోతి వృషోత్సర్గం సుతీర్థేఽ వా జలాంజలిమ్,*
*న దదాతి సుతో యస్తు పితురుచ్చార ఏవ సః."*

**– మత్స్యపురాణం**

కుమారుడై పుట్టి శ్రీకృష్ణానది దివ్యతీర్థములయందు ఉదకాంజలిని వదలక ఎవడు ఉంటాడో వాడు తండ్రికి మలం వంటివాడు.

*"ఏవం కృత్వా హ్యవాప్నోతి ఫలం వాజిమఖోదితమ్,*
*యముద్దిశ్య సృజేత్ నీలం స లభేత పరాం గతిమ్."*

**– భవిష్యపురాణం**



కృష్ణానదీ తీర్థమందు పితృతర్పణ, పిండప్రదాన, తీర్థవిధులు, వృషోత్సర్జనం చేసినట్లయితే ఆ యజమాని అశ్వమేధయాగ ఫలం పొందుతాడు.

*"వృషోత్సర్గో యది భవేత్ ప్రతత్వాత్ ముచ్యతే తదా,*
*తస్మాన్నృప త్వమప్యేవం వృషోత్సర్గం కురు ప్రభో."*

*"శ్రాద్ధేన పరదత్తేన గతః ప్రేతోఽ పి సద్గతిమ్,*
*కిం పునః పుత్రదత్తేన పితాయాతీతి చాద్భుతమ్."*

**– గరుడ పురాణం**

వృషోత్సర్జనమును చేసి, శ్రాద్ధవిధిని చేసినట్లైతే ప్రేతత్వ విముక్తి కలుగుతుంది ఆ జీవికి. ఈ కర్మలు తీర్థ శ్రాద్ధ విధులు, వృషోత్సర్జనము, కరుణతో మరణించినవారి గురించి ఇతరు లిచ్చినా ప్రేతత్వ విముక్తి పొంది జీవి సద్గతిని పొందుతాడు. అంటే కుమారుడు చేస్తే ఎంత ఫలమో ఏం చెప్పవలె! ఈ కర్మలు చెయ్యని పుత్రునికి ఎంత పాపమో దీన్నిబట్టి గుర్తించుకోవచ్చు.

*"వృషోత్సర్జన వేలాయాం వృషాభావః కథంచన,*
*మృద్భిః పిష్టైశ్చ దర్భైర్వా వృషం కృత్వా విసర్జయేత్,*
*న శక్యతే వృషోత్సర్గో హోమం వా తత్రకారయేత్."*

**– గరుడపురాణం**

శాస్త్రకర్తలైన మహర్షులు ఎంత దయాశాలులో మనం గుర్తించాలి. ఈ కాలంలో మనం చేయలేని విధులు, విధానాలు చెప్పారు అని అనిపిస్తుంది. కానీ వారు మనకు చెప్పింది కర్మయందలి శ్రద్ధనే. వస్తువు సంపాదించలేకపోయినా విధానాలు, విధులు సర్వమూ సంపూర్ణముగా చేయలేకపోయినా సద్భావముతో, శ్రద్ధతో కర్మయందు విశ్వాసముతో ప్రవర్తిస్తే

చాలు అని కూడా చెప్పారు. వృషభాన్ని వదలలేనివాడు మట్టితోగాని, పిండితోగాని బొమ్మచేసి వదలవచ్చు. దర్భలతోనైనా వదలవచ్చు. ఈ విధానాలలో మరణములయందు కూడా చాలా అధోగతిని కల్పించే మరణములు చాలా ఉన్నాయి. వాటిని కూడా శాస్త్రకారులు చూపించారు.

*"శస్త్రఘాత మృతాః యే చ మృతా యే చ చతుష్పథే,*
*వ్యాఘ్రైః సర్పైర్వరాహైశ్చ భక్షితా శ్చ్వాపదై స్తథా.*
*వర్ణసంకర కర్తారో బ్రహ్మసూత్ర వివర్జితాః,*
*బ్రాహ్మణానాం గురూణాం చ తథా యే లింగభేదకాః.*
*జలాగ్ని బంధనభ్రష్టా స్తథా ఆత్మప్రహింసకాః,*
*సంతానరహితా యే చ క్షయరోగేణ యే మృతాః.*
*ఏతై శ్చాన్యైశ్చ బహుభిః మ్రియంతే వాథ మృత్యుభిః,*
*యాన్తి తే నరకే ఘోరే యే చ మ్లేచ్ఛాదిభిర్హతాః.*
*ఉదక్యా సూతకీ శూద్రా రజకీ సంగదూషితాః,*
*తేన పాపేన నరకా న్ముక్తాః ప్రేతత్వభాగినః."*

**– విధానమాలా**

ఈ పైన చెప్పిన మరణములు దుర్మరణములుగా చెప్పబడినాయి. ఈ మరణములు పొందినవారు నరకమును పొంది తిరిగి ఉత్తమ శరీరములేక ప్రేతత్వాన్ని పొందుతారు. ప్రతత్వంలో ఉన్నప్పుడు పరులను పీడిస్తారు.

*"కులే గ్రామే వనే గేహే క్రీడాం కుర్వన్తి తే చ వై,*
*తేషాం పీడావినాశార్థం త్రిపిండీ శ్రాద్ధమాచరేత్."*

**– స్కాందపురాణం**

వీరి పీడా నివృత్తికి, ప్రేతత్వం పోవుటకు శ్రాద్ధకర్మలు తప్పక చెయ్యాలి. ఇట్టి కర్మలు కృష్ణానదీ తీర్థమునందు చేసిన మరీ విశేషం. కృష్ణానదీ తీరమునందు మహాక్షేత్రములున్నవి. ఆ క్షేత్ర సన్నిధానతీర్థములందు



పుష్కరపర్వకాలములలో తీర్థ శ్రాద్ధ విధులు సలిపిన అక్షయమైన ఫలం కలుగుతుంది.

*"సంగమం పంచనద్యాశ్చ కృష్ణవేణ్యా సుసంగతమ్,*
*తత్తీర్థం వర్ణితం శక్తో న కోఽపి భువనత్రయే."*

**– కృష్ణామాహాత్మ్యం**

కృష్ణాపంచనదీ సంగమం అనగా నర్సోబావాడి స్థానము మహా పవిత్రస్థానముగా వర్ణించారు. దాని ప్రభావమును వర్ణించుటకు బ్రహ్మకు కూడా శక్యముకాదన్నారు. అటులనే అనేక మహాక్షేత్రములు స్కాందపురాణంలో, కృష్ణామాహాత్మ్యంలో వర్ణించబడి ఉన్నవి. ఆంధ్రప్రదేశములో ఉన్న విజయవాడ కనకదుర్గా మల్లేశ్వర క్షేత్రము. శ్రీ శైలము భ్రమరాంబామల్లికార్జున దివ్యక్షేత్రము. అలాగే సుప్రసిద్ధమైన అమరావతి చాముండామరేశ్వర దివ్య సన్నిధానం, ముక్త్యాల ముక్తేశ్వర మహాక్షేత్రం. అవనిగడ్డ దగ్గర కృష్ణా సముద్రసంగమ స్థానం. ఇలా పవిత్రములైన దివ్యక్షేత్రములు శైవ, వైష్ణవ దివ్యక్షేత్రములుగా ప్రసిద్ధములైనవి ఉన్నవి.

## 15

*"సుతం లేభే వంధ్యా ఋణహతిమృణీ దుఃఖ్యపి సుఖం*
*నరో యోయో యంయం స్మరతి హృది కామం ససచతమ్,*
*అవాపేతి జ్ఞాత్వా జనని పతితస్త్వేఽద్య పురతో*
*నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే."*

అమ్మా కృష్ణవేణీ! జాతివంధ్యగాని (గొడ్రాలు), మృతవంధ్యగాని, దీర్ఘాయుష్మంతు డయిన పుత్రుని నీ దయతో నీ తీరమందలి శ్రీ దత్తాత్రేయ పాదుకాసేవనంతో పొందగలిగినది.

*"అనపత్యా భవేత్ వంధ్యా మృతవత్సాఽ పరా స్మృతా,*
*స్రవత్ గర్భా చ కాచన కాకవంధ్యాఽ పరాభవేత్."*

**– వాయుపురాణం**

స్త్రీలలో నాలుగువిధాల వంధ్యలను చెప్పారు. సంతానం కలగని స్త్రీ అని, కలిగినసంతానం నశించేస్త్రీ అని, గర్భములు కలుగుతూ స్రవించే స్త్రీ అని, ఒక్క సంతానము కలిగి మరల గర్భమే ధరించని స్త్రీ అని నాలుగు (కాకవంధ్య) రకములుగా చెప్పారు. ఇటువంటి వంధ్యా స్త్రీలు కృష్ణానదిలో స్నానము చేసి పాప ప్రతిబంధకమును పోగొట్టుకుని దీర్ఘాయుష్మంతులయిన పుత్రులను పొందగలిగారు. ఇది కూడా ఒక కథ చూపిస్తున్నాను. శ్రీ క్షేత్ర నర్సోబావాడీ దగ్గర శిరోల్ అనే గ్రామం ఉన్నది. అక్కడ ఒక విద్వాంసుడైన బ్రాహ్మణుడు గంగాధరుడనే అతడు ఉన్నాడు. ఆయన భార్యకు ఐదుగురు పుత్రసంతానము వరుసగా కలిగి మరణించారు. అందువలన ఆయన పుత్రశోకంతో పెద్దల దగ్గరకు వెళ్లి ఈ పుత్రశోకానికి కారణం ఏ కర్మ విపాకం అని అడిగి తెలుసుకున్నాడు. వారు చెప్పారు.

*"గర్భపాతం ప్రకురుతే తామసో యో నరాధమః,*
*జాన్మాంతరే తు తద్దోషాత్ మృతపుత్రో భవేన్నరః.*
*అశ్వహంతా చ గోహంతా వంధ్యాత్వం ప్రతిపద్యతే,*
*పరద్రవ్యాపహర్తాపి మృతపుత్రో భవే న్నరః."*

తామసుడై తమోగుణంతో కూడిన మనుష్యుడు బలవంతముగా గర్భస్రావము చేయువాడు, గుఱ్ఱములను చంపువాడు, గోహత్య చేయువాడు, పరుల ద్రవ్యాన్ని అపహరించేవాడు సంతానమును జన్మాంతరములో పోగొట్టుకుంటాడు. ఈ గంగాధరుని దంపతులు పూర్వజన్మలో శౌనక గోత్రమందు పుట్టిన బ్రాహ్మణుని ధనాన్ని అపహరించారు. అతడు ధనమందు లుబ్ధుడు. ఆత్మహత్య చేసుకున్నాడు. పిశాచమై వీరి సంతానాన్ని సంహరిస్తున్నాడు అని చెప్పారు.



*"లోహాశ్మదారుచూర్ణాని ప్రయత్నాత్ జరయేత్ పూమాన్,*
*బ్రహ్మస్వం త్రిషు లోకేషు కః కథం జరయిష్యతి."*

లోహముగాని, రాయిగాని, కఱ్ఱగాని పొడిచేసి తాగినా జీర్ణం చేసుకోవచ్చు. కాని బ్రాహ్మణ ద్రవ్య మపహరించి ఎవ్వరూ జీర్ణము చేసుకోలేరు. చేసిన పాపప్రారబ్ధములు అనుభవిస్తేగాని తొలగవు కదా! అని చెప్పగా ఈ పాపకర్మ నివృత్తి అయ్యే మార్గమేమిటి అని ప్రార్థించగా వారు ఉపాయం చెప్పారు.

*"ప్రేతోర్ధ్వదేహికం కర్మ ప్రాయశ్చిత్త పురస్సరమ్,*
*కారయిత్వాంగ భర్త్రా త్వం మాసమాత్రం వ్రతం చర.*
*కృష్ణాపంచనదీ యోగే స్నాత్వా శ్రీగురుపాదుకామ్,*
*ఔదుంబరం చాష్టతీర్థం స్నానపూర్వం సమర్చయ.*
*బ్రాహ్మణాన్ భోజయిత్వాథ శతద్రవ్యం ద్విజాయతే,*
*దేహి శౌనకగోత్రాయ శుద్ధిస్తేనైవ తే సతి."*

నారాయణబలితో మీ దంపతులు ఆ శౌనకగోత్ర బ్రాహ్మణునికి కర్మకాండచేసి, నెలరోజులు ఉపవసించి, కృష్ణా పంచనదీ సంగమ మధ్యలో స్నానం చేస్తూ గురుపాదుకార్చన చేయాలి. ఇలా నెలరోజులు వ్రతాన్ని జరిపి శౌనకగోత్ర బ్రాహ్మణుని పిలిచి నూరురూపాయలు మృతుని పేరుతో ఆయనకు దానం చేయాలి అని చెప్పగా అంత డబ్బు ఇచ్చుకోవడానికి శక్తిలేదని, పంచనదీ సంగమ కృష్ణానదిలో స్నానము, నియమోపవాసము, శ్రీ కృష్ణాతీరమందలి గురుపాదుకలను అర్చించడము చేశారు. కృష్ణాస్నానముతో పాపవిముక్తి కలిగి, శ్రీ గురుపాదుకా సేవనముతో దత్తాత్రేయ అనుగ్రహము కలిగి వారికి ఉత్తమ పుత్రప్రాప్తి కలిగింది. ఋణవిముక్తి చేసుకోకుండా ఉన్న ప్రతిబంధకమే ఉంటుంది. ఋణములు రెండు రకాలు. లౌకిక ఋణము, శాస్త్రీయ ఋణము అని. లౌకిక ఋణము

ధనాది రూపము. శాస్త్రీయ ఋణములు ఋషిఋణమని, దేవఋణమని, పితృఋణమని మూడు విధములు. వీటివలన కలిగే తాపములు మూడు. ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మికములను దుఃఖములు వదలి పరమసుఖాన్ని పొందుతాడు. శ్రీ కృష్ణానదీ సేవనము వలన. నరుడనగా (స్వకర్మణా నృత్యతీతి నరః) లోగడ కర్మలతో అధీనమైన నడక గలవాడు. అట్టి నరుడు నిన్ను సేవించి నీ దయవలన కోరిన కోరికలనెల్ల పొందగలడు. ఇది తెలుసుకుని విధేయతతో నీకు నమస్కరిస్తున్నాను.

## 16

**అహో మాహాత్మ్యం తే శుక జనక ఆహాత్ర హి మహా**
**బలేశాదాసింధో రుభయ తట సంస్థేషు బహుషు,**
**మహాతీర్థేష్వగ్ర్యం నృహరిపురి తీర్థాష్టకమిదం**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

అమ్మా కృష్ణవేణీ! శ్రీ వ్యాస మహర్షులవారు నీ మాహాత్మ్యాన్ని చెప్పారు. ఆ కృష్ణామాహాత్మ్యంలో నీవు బయలుదేరిన మహాబలేశ్వరం నుంచి పూర్వసముద్రములో నీవు చేరునంత వరకు నీ దక్షిణోత్తర ఉభయ తీరములందు అనేకములైన అమరావతి, విజయవాడ, ముక్త్యాల, వేదాద్రి, కురవపురం మొదలైన ప్రసిద్ధ మహాక్షేత్రములు, తీర్థములు ఎన్నో ఉన్నవి. అన్నీ సర్వపాతకములను పోగొట్టగలిగిన సర్వసమర్థములైనవే. అందులో నృసింహపురమైన నర్సోబావాడీ యందున్న అష్టతీర్థములు పరమ ముఖ్యములైనవి.

**"బ్రహ్మహత్యాహరం తీర్థం కృష్ణా పశ్చిమవాహినీ,**
**యా తత్రైవ శుక్లాఖ్యం స్థానాత్ శుక్లీకరోతి యత్.**
**తతోఽగ్రతః పాపవినాశి కామ్యతీర్థం పరోదుంబరసన్నిధౌ చ**
**సిద్ధాఖ్యతీర్థం వరదం తథైవ అమరేశ్వరస్య అమరతీర్థమగ్రే**



**స్యాత్ కోటితీర్థం త్వథశక్తితీర్థం ప్రయాగతీర్థం చ తతస్తతోఽగ్రే**
**షట్కూల ఏతాని పరప్రతీరే మహాష్టతీర్థాని మహాఘహృంతి**
**న బ్రహ్మహత్యాది మహాఘసంఘో యద్దర్శనాదేవ నిమేషమాత్రమ్**
**స్థాస్యత్యశేషాఘ హరాష్టతీర్థస్నానాది పుణ్యం కిము వాచ్యమత్ర."**

నర్సోబావాడియందున్న కృష్ణా పశ్చిమ ప్రవాహమందున్న ఎనిమిది తీర్థములివి. శుక్లతీర్థము, పాపవినాశి, కామ్య, సిద్ధ, అమరతీర్థ, కోటితీర్థ, శక్తితీర్థ, ప్రయాగతీర్థము లనునవి. ఈ తీర్థదర్శనమే బ్రహ్మహత్యాది మహాపాపములను పోగొడుతుంది. అనగా స్నానాదులు చేస్తే ఏమి ఫలమో ఏమి చెప్పవలె!

## 17

**ముఖం తే సహ్యాధః సదయహృదయం తే నరహరేః**
**పురేఽప్యాంధ్రే నాభిః ప్రపదయుగళం ప్రాచ్యవిషయే,**
**అయే శ్రీకృష్ణేఽదః ప్రథితమిహ రూపం మునిమతే**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

అమ్మా కృష్ణవేణీ! సహ్యాపర్వతముయొక్క క్రింది భాగముగా 'వాయి' అనే క్షేత్రమే నీ ముఖముగా వర్ణించారు. అక్కడ బ్రాహ్మణులయొక్క సమూహము ఎక్కువగా ఉండేది. కనుక ముఖముగా వర్ణించారు. 'బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్' అను శ్రుతి ఉండడం వలన ముఖస్థానముగా చెప్పబడినది. నర్సోబావాడీ దయామయమైన అంతఃకరణ స్థానముగా చెపుతారు. శ్రీ నరసింహ సరస్వతి దివ్యపాదుకా స్థానము. కనుక దయామయమైన హృదయముగా పవిత్రమైన ఆంధ్ర ప్రదేశమందున్న కురుగడ్డి (కురువపురం), విజయవాడ, ముక్త్యాల, అమరావతి మొదలగునవి మధ్య ప్రదేశమైన నాభిస్థానముగా చెప్పారు. తూర్పు ప్రాంతమందున్న హంసలదీవి దగ్గర రెండు ప్రవాహములుగా సముద్రమునందు కలిసే

స్థానముగాన రెండు పాదములుగా తత్త్వజ్ఞులైన మహర్షుల దృష్టిలో భూమండలమందు అతి ప్రసిద్ధములైన మహాస్థానములుగా ప్రసిద్ధి కెక్కి ఉన్న శ్రీ దత్తాత్రేయ ప్రీతిపాత్రమైన నీకు నమస్కారము.

## 18

**నరః శ్రీ కృష్ణే తే సులభమమృత స్పర్ధి మధురం**
**వరం నామ బ్రూయాత్ కథమపి కథమపి సనిశ్రేయస మియాత్,**
**సుదూరస్థోఽస్వస్థోఽప్యథ కిముత సాక్షాత్ భజతి యో**
**నమః శ్రీకృష్ణే తే జయ శమిత తృష్ణే గురుమతే.**

ఓ కృష్ణే! నీ స్వరూపము ధ్యానమునకు మంగళమైనది. ఇక నీనామ విషయము చెప్తున్నాను. ఏ మనుష్యుడైనా ఎంత దూరమందున్నవాడైనా రోగాదులతో బాధపడుతూ అస్వస్థుడై ఉన్నా చిత్తముయొక్క ఏకాగ్రత లేనివాడైనా ప్రయాసలేకుండా సులభముగా ఉచ్చరించతగినది, అమృతముకంటె ఆనందదాయకమైనది, మధురమైన నీ పేరును పరిహాసముగా పలికినా అతడు మోక్షానికి పాత్రుడవుతాడు. నీ సన్నిధికి వచ్చి, నిన్ను భక్తితో సేవించి, నీ పేరును భజించిన వానికి కృతార్థత కలుగుతుందని ఏం చెప్పాలి?

## 19

**పురేష్టం వా దత్తం విహితమపి పూర్తం చ సుకృతం**
**స్వధీతం వా జప్తం శ్రుతమపి యశోఽజస్య హి తదా,**
**భవద్దృష్టిః కృష్ణే భవతి భవభీహృత్ ఖలు నృణాం**
**నమః శ్రీకృష్ణే తే జయ శమిత తృష్ణే గురుమతే.**

అమ్మా! కృష్ణవేణీ! అద్భుతనామ రూప వైభవము కలిగిన నీ దర్శనము అందరికీ సులభమా? వెనుకటి జన్మలలో ఎవడు యజ్ఞయాగాదులు జరిపి



ఉంటాడో, సత్పాత్రములయందు దానములు చేసి ఉంటాడో, ఆరామ వాపీ కూప తటాకాదులు నిర్మించి ఉంటాడో, శ్రౌత స్మార్త కర్మలు చక్కగా అనుష్ఠించి ఉంటాడో, సాకల్యముగా వేదాధ్యయనము జరిపి ఉంటాడో, గాయత్రి మొదలైన పవిత్రములైన జపములుచేసి ఉంటాడో, నారాయణుని, మహేశ్వరుని కళ్యాణ గుణములు విని ఉంటాడో అట్టివాడే సంసారభీతిని తొలగించగలిగిన నీ దివ్యదర్శనమును పొందగలుగుతాడు.

## 20

**ప్రకృత్యైక్యం భిన్నం న హరిహరయోః ప్రత్యయవశాత్**
**పృథగ్వత్ భాతీతి ప్రథయతు మహాశంభు వపుషా,**
**యుతా వేణ్యాపి, త్వం, భగవతి పృథక్త్వం న భజసే**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

శివ విష్ణువులకు భేదము లేదని సర్వపురాణములు, గాథలు స్పష్టముగా చెప్పుచున్నాయి. వివేకవంతులు ఈ మాటను తప్పక అంగీకరిస్తారు. వారిద్దరికి భేదము అనేది ఉండదు. సాత్త్విక, తామస ప్రకృతులయొక్క కల్పనవలన ఒకరు హరియని, మరొకరు హరుడని, ఒకాయన మేఘశ్యాముడని, మరొకాయన కర్పూరమువలె తెల్లనైనవాడని లోకమందు చెప్పబడతారు. ఈ భేదము కల్పనా మాత్రమే అని, నిజము కాదని చెప్పుటకై *(శ్యతి దుఃఖం తనూకరోతి ఇతి శంసుఖం భవత్యస్మాదితి శంభుః= శివః)* సదా శివస్వరూపమైన వేణీనదితో కలసి కూడా విష్ణురూపమైన నీవు భేదము లేదని చూపిస్తున్నావు చిద్రూపముగా ఒక్కటే గనుక.

## 21

**అయే యోగిధ్యేయే నిగమగణగే యోఽబ్ధినిలయేఽ**
**నపాయే దత్తా యే కలుషవిలయే సహ్యతనయే,**

**త్వదన్యన్నో వీక్షే సులభ శరణం లీఢ మరణం**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

సర్వ విధముల ఆశ్రయించ దగిన దానివి నీవేనని నిన్నే ప్రార్థిస్తున్నాను. యమ, నియమ, ఆసన. ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధులనే ఎనిమిది అంగములు గల యోగాభ్యాసబలంగల వారిచేత ధ్యానించదగినదానివి నీవు.

వేదములచేత స్తోత్రము చేయబడేదానివి నీవు. తూర్పు సముద్రమందు లయమవుతున్న దానివి. శ్రీ దత్తాత్రేయ గురుమూర్తి నిన్ను సేవించువారికి సర్వ శుభ పరంపరలను ఇస్తాడు. అట్టి కరుణామూర్తివి. పాపాలను పోగొట్టే దానివి. సహ్యపర్వతమునుంచి బయలుదేరిన ఓ కృష్ణవేణీ! నిన్ను శరణుపొందిన వానికి మృత్యుభయం ఉండదని, నీకంటె సులభముగా శరణము దొరకదని నిన్నే ఆశ్రయిస్తున్నాను.

## 22

**పరిక్రాంతా దేశా భగవతి చతస్రోపి చ దిశా**
**న శాంతా దుష్టా సాప్యజని వపుషో మేఽన్తిమదశా,**
**ప్రశాంతాఽద్యైవాఽశా తవ దృశివశా దాస సుదశా**
**నమః శ్రీ కృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

అమ్మా! భగవతీ! వదిలి పెట్టని ఆశతో నేను తూర్పు మొదలైన నాలుగు దిక్కులు తిరిగాను. అన్ని ప్రాంతాలు తిరిగాను. ఐనా నన్ను దుష్టమైన ఆశ మాత్రం వదలలేదు. నా శరీరానికి మాత్రం ముసలితనం వచ్చింది. నా అదృష్టవశంచేత నీ కృపాదృష్టివలన ఇప్పటికి నాకు ఆశ శమించింది. నీ కటాక్ష వీక్షణమువలన నాకు శుభస్థితి కలిగింది. దీనినిబట్టి నీ కంటె సులభముగా రక్షించేవారు ఎవరమ్మా!



## 23

**త్వదీయే సత్తోయే జలచరగణౌ యే గత భయం**
**వయాంసీశేవాఽన్యే పశుమృగగణాః కీటకగణాః,**
**అపి స్నాతాః పీతాః కథమపి తతస్తే దివమితా**
**నమః శ్రీ కృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

అమ్మా! జగజ్జననీ! నీ నిర్మల ఉదకమందు, పవిత్ర తీర్థమందు జలచర జంతువులు, పక్షిసముదాయములు, లేళ్లు మొదలైన మృగములు, క్రిమికీటకములు కూడా స్నానము చేసి జనన మరణ భయాలను వదలిపెట్టి స్వర్గాన్ని పొందగలుగుతాయి. వివేకము కలిగిన మనుష్యులు యథావిధిగా స్నానపానములు చేసినవారు కృతార్థులు అవుతారని వేరే చెప్పవలసినదేమున్నది.

## 24

**గతః క్రూరో జారో దివమపి చ చోరో వనచరో**
**వరోదే, తే స్నానాత్ కథమపి నరో యః శ్రుతపరః,**
**స కిం స్నానాత్తే న వ్రజతి గతి మంబ శ్రుతమతే**
**నమః శ్రీ కృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

కఠినచిత్తుడు, దయలేనివాడు, పరస్త్రీ సాంగత్యము గలవాడు, సువర్ణాదులను అపహరించేవాడు, సంస్కార రహితుడైన ఆటవికుడు అయినా నీ పవిత్రజలమందు స్నానమాత్రముచేతనే స్వర్గానికి వెళ్లగలిగితే శాస్త్రోక్తమైన సదాచారపరుడు విధివిధానముగా స్నానాదులు ఆచరించినవాడు ఉత్తమగతిని ఎందుకు పొందడు.

## 25

**అపి స్నాతం తీర్థం సకల మఖిలం దైవత మిహాఽ**
**ర్చితం సర్వం దత్తం కృతమపి చ పూతం ఖలు కృతమ్,**

**తవ స్నాతం మాతర్విధివ దిహ యేనాంబు సుగతే**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

శోభనజ్ఞాన స్వరూపిణివైన తల్లీ! కృష్ణవేణీ! ఏ మానవుడు నీ దివ్యతీర్థమునందు యథావిధిగా నీ దివ్యతీర్థమునందు యథావిధిగా స్నానం చేస్తాడో అతడు ఈ భూమండలమందలి సర్వతీర్థములందును స్నానము చేసినట్లే. అతడు సమస్త దేవతలను అర్చించినట్లే. తులా పురుషాది దానములను సత్పాత్రమందు చేసినట్లే. అతడు పశు సోమాది సర్వక్రతువులు యజించినట్లే. వాపీ కూపతటాకాది నిర్మాణములు చేసినట్లే యగును. కృష్ణానదీ స్నానమే సర్వ పుణ్యములను కల్పిస్తుందని భావము.

## 26

**అవజ్ఞాతం తీర్థం సకలమపి దేవా అవమతాః**
**న దత్తం యేనేష్టం మతమపిచ పూర్తం కిమపి నో,**
**శ్రితం త్వత్సామర్థ్యాదరభరవశాత్ దేవి సరితే**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

అమ్మా! కృష్ణవేణీ! నీ సామర్థ్యమందలి ఆదర విశేషమువలన నేను ఏ నదీ పుష్కరతీర్థములను సేవించలేదు. ఇంద్రాది దేవతలను ఆరాధించలేదు. ఏ దానములును చేయలేదు. ఏ యాగములు జరుపలేదు. అయినా నిన్ను సేవించిన నాకు ఎట్టి కొరత లేని సర్వ పుణ్యప్రాప్తి ఉన్నదనే నిశ్చయముతో ఉన్నాను.

## 27

**క్షమః కస్యాప్యగ్రే క్షణమపి న చ స్థాతు మభవే**
**భవేయం తూర్ధ్వాస్యోఽబ్ధమిహ హి హాస్యాస్పదమతః,**
**తవేయం లజ్జాఽస్తా మయి సపది మాముద్ధర, హితే**
**నమః శ్రీ కృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**



సంసారతాపాన్ని నివృత్తి చేయగలిగిన ఓ జననీ! నేను ఏ మనుష్యుడిని గాని, దేవతనుగాని, తీర్థముగాని సేవించిన వాడినికాను కనుక నన్నెవరు అనుగ్రహిస్తారా అని ఆధారరహితముగా చూస్తున్నాను. ఈ లోకం దృష్టిలో నేను హాస్యాస్పదుడ నయ్యాను. నిన్నాశ్రయించి ఇలా నవ్వులపాలు కావటం నీకు సిగ్గు కలిగించదా! ఇది మనస్సులో ఆలోచించైనా ఇక ఏ మాత్రము వాయిదాలు వేయక వెంటనే నీయందే భక్తినిష్ఠ కలిగిన నన్ను ఉద్ధరించు.

## 28

**త్వయా ప్రత్యాఖ్యాతో యది భవతి భీతోఽయ మభవే**
**భవేదజ్ఞస్యాస్య త్రిజగదుదరే కిన్ను శరణమ్,**
**రణన్నుచ్చైరుచ్చైః తదిహ మరణం యామి మహితే**
**నమః శ్రీకృష్ణే తే జయ శమిత తృష్ణే గురుమతే.**

నీవు అభవవు. (అః వాసుదేవః; భవః శివః) హరిహరాత్మకమైన దానవు. అమ్మా! కృష్ణవేణీ! నీ భక్తుడనైన నేను నీచేత తిరస్కరింపబడినవాడినైతే ఇక ఈ బ్రహ్మాండమందు వీనిని రక్షించగలవారు ఎవరుంటారు? రక్షణలేని ఈ దీనస్థితితో మాటి మాటికి పెద్దధ్వనితో దీనారావములు చేస్తూ మరణించవలసినదే. ఇట్టి స్థితి నాకు కలగకుండానే నన్ను రక్షించు.

## 29

**మహాపాపం తాపం గతమపి సకంపం గత కృపం**
**సశాపం లోకో మాం హసతు, తనుతాపం న గణయే,**
**బిభే మ్యంహోపాయే, తవ బిరుదభంగాత్ భగనుతే**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

సర్వపాపములను పోగొట్టే ఓ తల్లీ! నేను త్రివిధ తాపములు కలిగినవాడిని. రక్షణలేని వాడిని. నన్ను చూచి లోకం నవ్వవచ్చు తిట్టవచ్చు.

అయినా ఆ శాప తాపాలను నేను లెక్కించను. సూర్యుని చేత స్తుతి చేయబడిన ఓ తల్లీ! నీ కున్న బిరుదులకు లోటు కలుగుతుందే. జీవులకన్న సర్వపాప శాప తాపాలను సేవించిన మాత్రముతో పోగొట్టకలదానివని నీకున్న బిరుదులకు భంగం కలుగుతుందని నేను బాధపడుతున్నాను. ఇదైనా ఆలోచించి నీవు తప్పక రక్షించవలసి ఉంటుంది.

## 30

**త్రితాపఘ్నీ తిఘ్నీ భువి పతితపావ న్యఘహరా**
**త్రిపాపఘ్నీ భీఘ్నీ వివిధ వరదాత్రీ ఋణహరా,**
**వరా సింధుష్వేతత్ బిరుదనిచయో జీవతు చిరం**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

అమ్మా కృష్ణవేణీ! నీకున్నటువంటి ప్రతిష్ఠ మాబోటివానిని రక్షించకపోతే చెడిపోతుంది. ఆ ప్రతిష్ఠ ఏమిటంటే జీవులకున్న ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మికములైన తాపములను పోగొడుతావంటారు నిన్ను. అలాగే ఈతి బాధలను తీరుస్తావు.

***అతివృష్టి రనావృష్టిః మూషకాః శలభాః శుకాః***
***స్వచక్రం పరచక్రం చ సప్తైతా ఈతయః స్మృతాః.***

ఇవి దేశానికి సంబంధించిన ఉపద్రవాలు. ప్రజలను పాలించేవారు శ్రీకృష్ణానదిని సేవించినట్లైతే అతివృష్టిగాని, వర్షములు లేకపోవుటగాని, ఎలుకలు, మిడుతలు, చిలుకలు పంటలను పాడుచేయుటగాని, దేశంలో ఆంతరంగిక ఉపద్రవములుగాని, పరదేశముల బాధగాని నీ అనుగ్రహముతో కలగదంటారు. నీ భక్తులకు అనేక వరాల నిచ్చేదానివి. దేవఋషి పితృ ఋణములు నిన్ను సేవించినవారికి తీరిపోతవంటారు. (అసత్యభాషణ, అపరిశుద్ధవాక్కు) మానసిక బాధలు సర్వమును పోగొట్టేదానివి. దృష్ట భయములు, అదృష్ట భయములు (కారణము తెలియకుండా ఆకస్మికముగా



వచ్చే భయములు) నీ కరుణతో నశించుతాయి. మహా పాపాత్ములైన జీవులను కూడా ఉద్ధరిస్తావు అని నీకు ఇన్ని బిరుదులు ఉన్నవి గదా! నాబోటి దీనుణ్ణి రక్షించనప్పుడు ఇవన్నీ నశించవా తల్లీ! ఇవి ఏ నదులకు లేని బిరుదులు గదా!

వీటిని నీవు నిలుపుకోవద్దా!

## 31

**యదాస్యావిర్భూతా త్వమిహ తత ఆరభ్య పతితా**
**విశోధ్యాప్యున్నేతా అధికతమ ఏభ్యోఽస్మృత ఇమమ్,**
**యథోద్ధర్తుం శక్తా త్వమపి తత ఉత్తిష్ఠ సరితే**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

అమ్మా! కృష్ణవేణీ! నీవు జలరూపంతో ఈ లోకంలోకి ఎప్పుడావిర్భవించావో అది మొదలు పతితులైనవారిని కూడా సర్వపాపరహితులను చేసి ఉన్నతస్థానానికి తీసుకు వెళ్లావు. "పాదోఽస్య *విశ్వాభూతాని*" అని శ్రుతి యందు చెప్పబడిన పాదరూపమైన మాయామయ ప్రపంచముకంటె అవతలకి *'త్రిపాదస్యామృతం దివి'* త్రిపాత్ అనే శబ్దముతో చెప్పబడ్డ ద్యోతనాత్మకమైన జరామరణ అశనా (యా) పిపాసా శోక మోహాది దోష రహితమైనది గనుక బాధరహితమైన వాసుదేవరూపమైన పరబ్రహ్మను చేరారు జీవులు.

నీచేత ఉద్ధరించబడిన పతితులకంటె నేను పెద్ద పతితుడిని. నన్ను గనుక రక్షించగలిగితే నీవు సర్వసమర్థురాలి క్రింద లెక్క. లేచి నాకు రక్షణచెయ్యి తల్లీ!

పరబ్రహ్మ అంశరహితమైనది. అట్టి పరబ్రహ్మకు పాదములు, భాగములు ఎలా కల్పించడం అని ప్రశ్నించుకుంటే పరబ్రహ్మ విషయము

తెలుసుకోదలచినవాడికి గుర్తు కలగటానికి చేసిన బోధ ఇది. అందుకనే శ్రుతి *'పాదోఽస్య విశ్వాభూతాని, త్రిపాదస్యామృతం దివి'* అలాగే స్మృతి కూడా *'విష్టభ్యాహమిదం కృత్స్న మేకాంశేన స్థితో జగత్'* అని అన్నది. పెద్దలు కూడా ఇలాగే అన్నారు. *'నిరంశేఽప్యంశ మారోప్య కృత్స్నేంశే వేతి పృచ్ఛతః, తద్భాష యోత్తరం బ్రూతే శ్రుతిః శ్రోతృహితైషిణీ. వికారావర్తి చ తథా హి స్థితి మహ'*అను న్యాయాధికరణం వలన ఇతరుల అధికారమును బట్టి వారి స్థాయిలో తెలిసేటట్టు చెప్పవలె గనుక పరబ్రహ్మవిషయము శ్రుతి స్మృతులు ఇలా చెప్పినవి.

## 32

**అయం సామాన్యోఽస్తీత్యపి మనసి మా స్థాపయ యతః**
**సమస్తాఘౌఘాః తే జనని మయి తిష్ఠంతి సుచిరమ్,**
**అతో బద్ధోత్తిష్ఠేశ్వరి పరికరం తం దృఢతరం**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

అమ్మా! నీ ముందు పడినవాడు పాపి, సామాన్యుడు అని అనుకోవద్దు. సమస్తమైన పాపములు కాయికములు, వాచికములు, మానసికములు, సాంసర్గికములు స్పృశించనవి, ఇంకా స్పృశించినవి, తెలిసినవి, తెలియబడనివి, అనుభవించినవి, అనుభవించనివి, అతిపాతకములు, ఉపపాతకములు, లఘుపాతకములు, సంకరీకరణ పాతకములు, మలినీకరణ పాతకములు, అపాత్రీకరణ పాతకములు, జాతిభ్రంశకరణ పాతకములు, ప్రకీర్ణపాపములు ఇవి గుంపులు గుంపులుగా చిరకాలమునుంచీ నాదగ్గర ఉన్నవి. సర్వలోకములను నియమించగలిగిన తల్లీ ఓ కృష్ణవేణీ! నన్ను రక్షించాలనే పట్టుదలతో నడుముకట్టి లేవాలమ్మా! సామాన్యంగా పూనుకుంటే చాలదు.



## 33

**మమోద్ధారేణాద్య త్రిజగతి సుకీర్తి ర్భవతు తేఽ**
**సితేఽ, తీతే కాలే న ఖలు విమలే త్వీదృగభవత్,**
**ప్రసంగోఽసంగోఽహం తత ఉపరి యాస్యేఽభయపదం**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

అమ్మా! కృష్ణవేణీనదీ! ఇంత దీనుడి నయిన నన్ను రక్షించడంవలన నీకు శోభనమైన కీర్తి కలుగుతుంది. ఎందుకంటే ఇంత పాపి నీకు ఉద్ధరించడానికి దొరకి ఉండడు. నీ అనుగ్రహంవలన నేను అసంగుడనైన పురుషుడిని కాగలను. *"అసంగో హ్యయం పురుషః"* సంగరహితమైన పరబ్రహ్మస్వరూపమును పొందగలను. భేదదర్శనమే భయాన్నిచ్చేది. తనకంటె వేరైనది ఒకటున్నది అని అనుకోవడమే భేదము. *"ద్వితీయాద్వై భయం భవతి"*శ్రుతి. *"భయం ద్వితీయాభినివేశతః స్యాత్"*అని భాగవతంలో అన్నారు. తాను అఖండమైన, ఏకైకమైన, జ్ఞానస్వరూపమైన పరబ్రహ్మము అనే భావమే జ్ఞానం. భయరహితం. *"యదా హ్యేవైష ఏతస్మిన్నదృశ్యే అనాత్మ్యే అనిరుక్తొ అనిలయనే అభయం ప్రతిష్ఠాం విందతే, అథ సోఽభయం గతో భవతి, యదా హ్యే వైష ఏతస్మిన్నుదర మన్తరం కురుతే, అథ తస్య భయం భవతి."* కనుక ఈ శ్రుతిని బట్టి మాయికమైన ప్రపంచము తనకంటె వేరుగా భాసిస్తుంది. ఈ భేదరూపమైన అజ్ఞానాన్ని దాటినవాడు అఖండ ఆనంద ఏకరసభూతమైన బ్రహ్మస్వరూపు డవుతాడు. *"ఏష సంప్రసాదోఽస్మాత్ శరీరాత్ సముత్థాయ పరంజ్యోతిరూపం సంపద్య స్వేనరూపేణ అపి నిష్పద్యతే"* అని శ్రుతి చెప్పుచున్నది. జీవునికి శరీరం ఉన్నప్పటికీ శరీరాభిమానం తొలగి జీవన్ముక్తు డవుతాడు. పాపప్రతిబంధకరహితుడై, శుద్ధచిత్తుడై నిత్య శుద్ధ బుద్ధ ముక్త సత్య జ్ఞాన ఆనంద స్వరూపుడవుతాడు. కృష్ణానదీ స్నాన సేవనములతో చిత్తశుద్ధిని పొంది బ్రహ్మజ్ఞానమునకు కూడా పాత్రుడవుతాడని చెప్పారు.

## 34

**అతః ప్రాదుర్భూత్వా పరమ నిజరూపేణ సహసా**
**మమాఘాద్రీన్ భిత్త్వా సకల మలహం్త్రీహ సహసా,**
**కృపాక్షీరం ధృత్వాంక ఉశతి చ మే దేహి సహసా**
**నమః శ్రీ కృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

సకల పాపములను పోగొట్టే ఓ జగన్మాతా! ఆకస్మికముగా ధ్యానములకు పరమశుభమైన నీ రూపముతో సాక్షాత్కరించి నా పాప పర్వతములను నీ బలముతో నశింపచేయుము. కుమారుడనైన నన్ను నీతొడమీద కూర్చొనబెట్టుకొని ఆర్ద్రమయిన నవ్వుతో నీ కృప అనే క్షీరమును నా కిచ్చి నన్ను రక్షించు.

## 35

**కుతస్త్వయ్యేతావత్ దురితమితి శంకాస్తు నయతోఽ**
**న్యథాత్మానం సన్తం తత ఇతరథా వేద్మి హి మయా,**
**నిజాత్మస్తేనేన ప్రతిపద మఘం కిం న హితితం**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

నీ కెంతో పాపముందంటున్నావు. ఈ పాప మెక్కడిది అని సందేహపడబోకు. అమ్మా! కాలత్రయమందు సత్యమై, రాగద్వేషములు లేని శుద్ధమై, జ్ఞానస్వరూపమై, సత్యస్వభావమై, పరిపూర్ణమై కర్తృత్వముగాని, భోక్తృత్వముగాని లేని ఆత్మను అనిత్యముగా పాపపుణ్యములకు కర్తనుగా, భోక్తనుగా నేను ఆత్మను గుర్తించడం ఆత్మస్తైన్యము. (తనను తాను మరచుట) ఇవి ప్రతిక్షణము మహాపాపమేగా. *“స వా ఏష మహానజఆత్మాఽ జరోఽ మరోఽ మృతోఽ భయః”* శ్రుతులయందు ఇలా నిరూపించిన ఆత్మను అనృతమైన దేహాదులవలె భావించడం పాపంకాదా! ఇదే ఆత్మచౌర్య మన్నది. శ్రుతి *“యోఽ న్యథా సంత మాత్మానం అన్యథా ప్రతిపద్యతే, కింతేన న కృతం పాపం చోరేణాత్మాపహారిణా”* తనను తాను దేహేంద్రియములవలె గుర్తించి ఆత్మస్వరూపమును మరవటమే దొంగతనము. శాస్త్రమందు ఆత్మ అంటే వివరించారు.



***“యాచ్చాప్నోతి యదాదత్తే యచ్చాత్తి విషయానిహ,***
***యచ్చాస్య సంతతో భావః తేన చాత్మేతి గీయతే.”***

సర్వదా తానై యున్నది. సర్వమును స్వీకరిస్తున్నది. గుర్తిస్తున్నది. విషయభోగములను పొందుతున్నది. సర్వానుభవములయందు ఉన్నది ఆత్మ అని చెప్పబడుతున్నది. ఇలా సర్వవిధములా సిద్ధమై ఉన్న ఆత్మను మరవటమే పెద్ద మహాపాపము.

## 36

**సమం సాక్షాత్ పశ్య స్వఖిలహృదయస్థే భగవతి**
**త్వదగ్రే వక్తవ్యం నహి నహి తథాపీహ వదతి,**
**ప్రభోరగ్రే లోకస్తదనుసరణం మేఽ స్తు శరణం**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

నా సంగతి నాకు తెలియదా! నువ్వు చెప్పవలెనా అని ఆగ్రహించకు తల్లీ. సర్వజ్ఞురాలవైన నీ దగ్గర లోకదృష్టితో చెప్పుకొనుచున్నాను. సకల హృదయములు తెలిసిన నీవు గుర్తించనిదంటూ ఉంటుందా! ఇక్కడ కవియొక్క భావము శివవిష్ణుభిన్నమైన పరమార్థతత్త్వమైన వస్తువునందే – సర్వజ్ఞురాలవైన నీ దగ్గర ఏమీ చెప్పనక్కరలేదు. తల్లీ! అయినను ఈ లోకంలో అన్నీ తెలిసి ఉన్నను ప్రభువుల దగ్గర తన గోడు తాను చెప్పుకోవడం ప్రజల కలవాటు. ఆ దృష్టితోటే నీ దగ్గర విజ్ఞాపన చేశాను.

## 37

**స్వ భూరూపేణ త్వం సృజసి హరిధామ్నాఽ వసి హరాఽ**
**త్మనా హంసీంద్రాద్యా విసృజసి విభూతీః స్వకలయా,**

**లయాంతే తే కుక్షిం విశతి సకలం మంగలగతే**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

జగజ్జన్మాదులకు కారణభూతమైన ఆత్మ, సాక్షి, నేను కాదంటావా. అమ్మా! నీవే బ్రహ్మరూపముగా ఈ సర్వలోకములను సృష్టిస్తున్నావు. నారాయణ రూపముతో సృష్టించబడిన జగత్తును రక్షిస్తున్నావు. రుద్రరూపముతో ఈ జగత్తులను ఉపసంహరిస్తున్నావు. నీ అంశతో ఇంద్రాది విభూతులను, వివిధ సృష్టిని చేయుచున్నావు. ఈ విధముగా మరల మరల దైనందిన సృష్టియందు బ్రహ్మ విష్ణురుద్ర రూపములతో సృష్టి స్థితిలయములను జరుపుచున్నావు. మహాప్రళయంలో ఈ సమస్త జగత్తు అవ్యక్తరూపమైన నీ కుక్షియందు వాసనా మానసాత్మకముగా నీ కళలతో ఈ జగత్తంతా నిండి ఉన్నది. నామరూప పరిత్యాగముతో నిన్నే చేరుతున్నది.

## 38

**ఇహాపి త్వం పాపి ప్రచయ మల సంక్షాలనపటూ**
**దకాత్మా భూరాభూరపి సురగణాః శాపమిషతః,**
**స్వతంత్రే సన్మంత్రే సరిత ఇహ భూత్వా తవ గతా**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

సర్వదా సన్మాత్రమైన ఆత్మ స్వరూపిణివి నీవు. సర్వ స్వతంత్రురాలివి. ఈ అవతారంలో కూడా పాపాత్ములయొక్క పాపములను క్షాళనము చేయ సమర్థమైన ఉదకముతో ప్రకాశిస్తున్నావు. ఈ భూలోకమందు శాపమనే నెపముతో అనగా దీనికొక కథ - యజ్ఞములు ప్రారంభించదలచిన బ్రహ్మగారికి ముహూర్త మతిక్రమిస్తుందనే భయంతో జ్యేష్ఠపత్ని దగ్గరలేకపోగా కనిష్ఠపత్నితో దేవర్షులయొక్క ఆజ్ఞతో యజ్ఞము ప్రారంభముకాగా బ్రహ్మగారి జ్యేష్ఠభార్యచేత ఈ బ్రహ్మరుద్రాది దేవతా సముదాయములు జడములౌగాక



అని శపించబడి కకుద్మతీ వేణీ మొదలైన నదులైనారు. కృష్ణాస్వరూపమైన నీయందు లయమును పొందుతున్నారు. ఇక జీవులంతా పరమార్థ స్వరూపమైన నీయందు లయమును పొందటంలో ఆశ్చర్యమేముంది?

## 39

**తమోనుత్తే భాసా జగతి ఖలు భాస్వాన్ న భవతి**
**స్వయం జ్యోతిః సత్వాం తపనమివ భంభాసయత ఇత్,**
**అయే భాతాం త్వాఽను ద్యుమణి సహితం భాతి సకలం**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

అమ్మా కృష్ణవేణీ! నీ తేజస్సుచేతనే లోకమందు చంద్ర, అగ్ని, సూర్యులు ప్రకాశిస్తున్నారు. చీకట్లను పోగొడుతున్నారు. *"చంద్రాగ్న్యర్కాస్తమోనుదః"* అమరం. నీవు స్వయంజ్యోతి స్స్వరూపము. సూర్యుడు నక్షత్రాదులను ప్రకాశింపచేసినట్లు నిన్ను చంద్రుడుకాని, అగ్నికాని, సూర్యుడుకాని ప్రకాశింపచేయలేరు. ఆ సూర్యచంద్రాగ్నులు నీ తేజస్సుచేతనే ప్రకాశిస్తారు. కనుక *"న తత్ర సూర్యోభాతి. న చంద్ర తారకం నేమా విద్యుతో భాంతి కుతోఽ యమగ్నిః తమేవ భాంతమనుభాతి సర్వం తస్య భాసా సర్వ మిదం విభాతి"* అని శ్రుతి. *"న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽ ఖిలమ్. యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకం"* అని స్మృతి.

## 40

**గణీవేణీ భూత్వాఽ ప్యసుర సురవారా ద్రుతపదో**
**మదోద్ధృత్యై య ద్భుగ్భువన జయినోఽ లం కుసుమగోః,**
**స గోవా హోఽ పి త్వాం పరమసఖివత్సంగత ఉతో**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

సర్వలోకమును జయించి వశములోనికి తీసుకొని వికారములు పుట్టించగలవాడిననుకొన్న పుష్పబాణుడైన మన్మథునియొక్క గర్వమును శాంతింపచేయటానికి నీ చిన్నకటాక్షమే చాలు. నందికేశ్వరుడు వాహనంగా గల ప్రమథ గణములు పరివారముగా గల దేవదానవులచేత పూజింపబడే పాదములు కలిగిన ఆ మహేశ్వరుడు కూడా వేణి యనుపేరుగల నదియై నీకు స్నేహితురాలివలె నీలో చేరుతున్నాడు. ఇక నీ మహిమ ఏమి చెప్పవలె?

## 41

**స్వయం భూర్బ్రహ్మాయం భువనరచనాభిజ్ఞధిషణః**
**కకుద్మత్యాఖ్యాసౌ సరిదిహ హి భూత్వాపి సుతవత్,**
**సమాయాత స్త్వాం సమ్ముఖము కరహాటాఖ్య విషయే**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

పంచ మహాభూతములయొక్క సృష్టి – పరమేశ్వరుని అధీనమైయున్నది. ఆ పరబ్రహ్మ ఐన సర్వేశ్వరుడే స్వాధీనమైన మాయాశక్తితో ఈ జగత్తులను సృష్టిస్తాడు. పరమాత్మయొక్క ఆజ్ఞచేత చరాచరములైన సకల భౌతిక శరీరములను బ్రహ్మగారు సృష్టిస్తారు. ఈ భవనములయొక్క రచనయందు చరాచరములైన భౌతిక శరీరముల రచనయందు పరబ్రహ్మయొక్క ఇచ్ఛతో (స్వయం భవతీతి స్వయంభూః) స్వయముగా ఈ ప్రజ్ఞ ఆయనకు కలుగుతుంది. ఈయన బ్రహ్మాండములకు అగ్రజుడని శ్రుతులయందు చెప్పబడినది.

*"హిరణ్యగర్భః సమవర్తతాగ్రే"* అని, *"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం"* శ్రుతి. "*స వై శరీరప్రథమః*" అని స్మృతి. ఈ బ్రహ్మ వింధ్య పర్వత ప్రాంతమందు కకుద్మతి అనే పేరుతో నదిగా అవతరించి కరహాటమనే ప్రాంతమందు (కొల్హాపూర్ ప్రాంతం) కుమారుడు తండ్రి ఒడిలోనికి చేరినట్లుగా నీయందు వచ్చి చేరుతున్నాడు. కనుక కృష్ణానదియనగా శ్రీదత్తాత్రేయ ప్రీతిపాత్రమని



దత్తభక్తులు కడుశ్రద్ధతో, భక్తితో సేవించుచున్నారు. కృష్ణానది కూడా కకుద్మతి బ్రహ్మగా, మణి శంకరునిగా, కృష్ణ సాక్షాత్ నారాయణునిగా బ్రహ్మ విష్ణు శివాత్మకమైన శ్రీ దత్తాత్రేయమూర్తి వంటిదే అని భక్తుల భావము.

## 42

**ద్విజాః కాలే కాలే శుచిషు చ చతుర్భిః ఫలదృశః**
**చతుర్భి ర్ద్వాభ్యాం పంచభిరపి బుధా జుహ్వతి సతి,**
**పునర్ద్వాభ్యాం స్నానాదపి నయసి నాకం త్వ మఖిలం**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

అమ్మా! శ్రీకృష్ణవేణీ! అర్థవాదశ్రుతి *"సాయం ప్రాతరగ్ని హోత్రం జుహోతి స్వర్గకామః"* స్వర్గాఖ్యమైన ఫలమును చెప్పగా ఆ ఫలమందు దృష్టికలవారై కోరికలను కోరుతున్నవారై విద్వాంసులైనా దేవతలు మొదలైన జ్ఞానములను సంపాదించి తత్త్వజ్ఞులు కాక జ్యోతిశ్శాస్త్రము చెప్పిన కాలకాలములయందు యాగములు చేస్తూ ఉంటారు.

*"కాలానుపూర్వా విహితాశ్చ యజ్ఞాః"* అని చెప్పబడి ఉన్నది. తత్త్వజ్ఞానమును మాత్రం పొందలేక పోతున్నారు. జీవ బ్రహ్మలయొక్క అభేదము గుర్తించిన వారికి కర్మల ఉపయోగం లేదు కదా! ఫలముల కోసమై కర్మలయందే చిత్తముపెట్టి దక్షిణాగ్ని, గార్హపత్య, ఆహవనీయములయందు *"శ్రావయ"* అను నాలుగు అక్షరములతో *"అస్తు శ్రౌషట్"* అను 4తో *"యజ"* రెండక్షరములతోటి *"యే యజామహే"* అను ఐదు అక్షరములతోటి *"వౌషట్"* అను రెండక్షరములతోటి యాగములయందు హోమములు చేస్తున్నారు. వీరికి వైరాగ్యము రావటమనేది చాలా కష్ట సాధ్యము. నీవైతే ఏ యజ్ఞాది అధికారములు లేకపోయినా కేవల శ్రద్ధతో, భక్తితో నీ పవిత్ర ఉదకమునందు స్నానము చేసినంత మాత్రముననే సుఖాస్పదమైన స్వర్గానికి సులభులను చేస్తున్నావు. యజ్ఞములకంటే కూడా నీ స్నానమందలి మాహాత్మ్యమే చాలా

గొప్పదని అర్థము. స్వర్గసుఖాన్ని చెప్పారు పెద్దలు. *"స్వర్గే లోకే న భయం కించ నాస్తి, న తత్ర త్వం న జరయా బిభేతి, ఉభే తీర్త్వా౽ శనాయాపిపాసే శోకాతిగో మోదతే స్వర్గలోకే."* భయము ఉండదు. ఆకలిదప్పులు లేవు. ముసలితనము రాదు. శోకం పొందని చోటు స్వర్గమున్నారు.

ఈ స్వర్గము కృష్ణాస్నానముచేతనే సులభము. కర్మలతో కొంచెము వ్యత్యాసము వచ్చినా ప్రత్యవాయములు ఎక్కువ. కాన వాటికంటె కృష్ణాసేవనమే మేలు.

## 43

**ప్రభావస్తే౽పీదృక్ దహతి దహనో వాతి పవనో**
**మనోహ్లాదే బీతస్తపతి తపనో ధావతి మృతిః**
**వృషావర్ష త్యన్యే త ఇహ బలి, ముఞ్చన్తి నియతం**
**నమః శ్రీ కృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

మనస్సును సంతోషపెట్టే ఓ తల్లీ! నీ గొప్ప స్వభావము, సామర్థ్యము ఎంత గొప్పవి. సమస్తమును దహింపచేసే అగ్నిహోత్రుడు నీ భయముచేతనే దహిస్తున్నాడు. (పవత ఇతి పవనః) కదలిక కలిగిన వాయుదేవుడు నీ భయము చేతనే వీచుచున్నాడు. నీ భయమువల్లనే సూర్యుడు లోకములను తపింపచేస్తున్నాడు. మరణించవలసిన ప్రాణిని సంహరించడానికి మృత్యుదేవత నీ భయంవల్లనే వెళ్లుతున్నది. ఇంద్రుడు నీ భీతివల్లనే వర్షిస్తున్నాడు. అలాగే లోకపాలకులు, వసువులు మొదలైన దేవతలు నీ ఆజ్ఞతోటే ప్రవర్తిస్తున్నారు. నీ ఆజ్ఞా పరిపాలనమనే పన్ను కట్టుకుంటూ ఉంటారు. *"భీషాస్మాత్ వాతః పవతే, భీషోదేతి సూర్యః, భీషాస్మాదగ్నిశ్చేంద్రశ్చ మృత్యుర్ధావతి పంచమః"* అని శ్రుతి చెపుతున్నది. ఈ పై చెప్పినవారికి నీ విచ్చిన సామర్థ్యముతోనే ఈ శక్తులు వచ్చినవిగాని స్వయముగా ఉన్నవి కావు. *"తస్మై తృణం నిదధావతద్దహేతి తదుప ప్రేయాయ సర్వజవేన తన్న*



*శశాక దగ్ధుం"* అని శ్రుతి. ఆ పరమాత్మ అగ్నిహోత్రునిముందు ఒక గడ్డి పోచవేసి తగులబెట్టమని అడిగితే దాన్ని దహించగలశక్తి కూడా అగ్నికి లేకపోయినది. అట్టి పరాత్పరుడే జలరూపముగా ఉన్న కృష్ణానది అని భావించవలె.

## 44

**క్వ శక్తిస్తే౽నంతే వివిధ కు కృతాద్రి ప్రహరణ**
**క్షమా సామాన్యం మే త్రివిధమపి పాపం క్వను కియత్,**
**తవాగ్రే వహ్న్యగ్రే విరస బహుశష్పాద్రివ దహో**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

పరిచ్ఛేదము లేని పరబ్రహ్మ స్వరూపిణివైన ఓ కృష్ణవేణీ! కొండలవలె పెరిగిపోయిన పాపరాశులను బద్దలు కొట్టగలిగిన నీ శక్తి ఎక్కడ? కాయిక, వాచిక, మానసిక రూపమైన సాధారణమైన నా పాప మెక్కడ? నీ శక్తిముందు నిలువగలదా తల్లీ!

జ్వాలామాలికలతో కూడిన అగ్నియందు ఎన్నివేలు ఎండిపోయన గడ్డిపోచలు పడినా అగ్నికి లెఖ్ఖా? కనుక నా పాపాన్ని నీవే దహింప చేయగలదానివి.

## 45

**న కృచ్ఛ్రాద్యాః శక్తా యదఘహరణాయాపి బహుశో**
**న చ ప్రాయశ్చిత్తం హవన జపనాద్యం క్షమ మభూత్,**
**స కృష్ణే త్వత్స్నానాత్ వ్రజతి సుశుచిస్సన్దివ మహో**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

ప్రాజాపత్యాది కృచ్ఛ్రములు, చాంద్రాయణము మొదలైన వ్రతములు, ఎన్నో విధానాలతో చేసిన తిలాదుల హోమములు, గాయత్ర్యాది జపములు,

పుణ్యతీర్థ స్నానములు ఏ పాపాత్ముని పాపములను పోగొట్టడానికి సమర్థములు కావో పాపాత్ముడు పైన చెప్పిన ఏ సాధనములు చెయ్యకపోయినా నీ దివ్య ఉదకమందు స్నానము చేయుటచేతనే సర్వపాపరహితుడై, శుచియై స్వర్గపాత్రు డవుతాడు. ఆశ్చర్యము! నీ మహిమ ఎంతది తల్లీ!

## 46

**కుసంగాన్యార్త్యర్థాపహరణ ముఖం కాయిక మఘం**
**హరే జ్యాఽర్యోన్నిన్దాక దశనముఖం వాచిక మఘమ్,**
**కుచింతాఽన్యా నర్థస్మరణ ముఖరం మానస మఘం**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

దురాచారపరులతో సాంగత్యం, పరపీడలు చేయటం, పరద్రవ్యాదులను అపహరించటం, దొంగతనం వంటివి కాయిక పాపములు. వీటిని పోగొట్టు తల్లీ! సత్పురుషులు, పూజ్యులైన పెద్దలు, దేవతలను దూషించడం, అపవిత్రమైన ఆహారము భుజించడం వాచిక పాపం. దానిని నీవే హరించవలె. దుష్టమైన విషయాలను ఆలోచించడం, పరులకు అనర్థాలనూహించడం ఇది మానసిక పాపం. దీనిని కూడా పోగొట్టు.

## 47

**త్వదీయాత్మ స్పృష్టః స్పృశతు గతి తే స్పర్శన ఉత**
**త్వదీయం పానీయం పతతు వదనాబ్జే మమ బత,**
**ఉతాహో త్వన్నీరే తుహినశిశిరేఽఽగం పతతు మే**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

జీవులకు సద్గతిని కల్పించే ఓ కృష్ణవేణీ! నీ పవిత్ర తరంగములను స్పృశించిన గాలి నన్ను స్పృశించుగాక. నీ నిర్మల ఉదకము నా నోటిలో పడుగాక. పరిశుద్ధమైన చల్లని నీ నీటిలో నేను స్నానము చేయుదును గాక. చాలు చాలు. ఇంతటనే నేను కృతార్థుడను కాగలను.



## 48

**నుతాం తీర్థై స్సర్వైరపి జగతి సర్వాభి రమలే**
**సరిద్భి ర్దేవేంద్రై రపి మునిభిరత్యాద్రుతతటామ్,**
**న కస్త్వాం సేవేత ప్రవర సరిదత్రాఽధిమథనే**
**నమః శ్రీకృష్ణే తే జయ శమితతృష్ణే గురుమతే.**

జీవుల సర్వమనస్తాపములు పోగొట్టే ఓ తల్లీ! సర్వ నదీమతల్లులచేత స్తోత్రము చేయబడేదానవు నీవు. ఇంద్రాది దేవతలు, మహామనీషులైన మునివరులు ఎంతో ఆదరముగా నీ నదీ తటమును సేవిస్తారు. ఇక్కడనే ఒక అద్భుతమైన గాథ కూడా ఉన్నది. దేవతలందరూ రాక్షసులచేత పరాభవమును పొంది దుఃఖాక్రాంతులై తపస్సుచేయగా వారి ప్రార్థనల నాలకించి సర్వేశ్వరుడైన మహేశ్వరుడు ఈ కృష్ణాతటములో వారికి సాక్షాత్కరించాడు. ఆ స్వామిని దేవేంద్రుడు పూజించాడు. ఆయన అనుగ్రహంతో దేవతారాజ్యము పొందాడు. ఆ స్వామిపేరే అమరేశ్వరు డన్నారు. ఆ క్షేత్రమును కృష్ణాతీరములో అమరావతి అని పిలుస్తారు. అగస్త్యమహర్షి వచ్చి ఆ స్వామిని ఆరాధించి అనుగ్రహము పొందారు. ఈ క్షేత్రమే క్రౌంచ పర్వతము మీద ఉన్నదన్నారు. ఇది పంచారామ క్షేత్రములలో ప్రసిద్ధమైన క్షేత్రము. ఇక్కడ జగన్మాత చాముండారూపముగా ప్రసిద్ధమైన మహాశక్తి స్వరూపము. ఈ స్థానము అష్టాదశశక్తి. స్థానములలో ఒకటిగా చెప్తారు. ఇట్టి మహాక్షేత్రములు, పుణ్యస్థానములు కృష్ణాతీరములో ఎన్నో విరాజిల్లుచున్నవి.

## 49

**ధరేంద్రతనయేఽభయేఽస్మ్యుపగతోఽనుకంపోదయే**
**జయేశ్వరి హరీశరూపిణి మణిద్యుతే త్వాఽర్థయే,**
**అయే నది న దీనతాం వ్రజతు హృన్మదీయం స్వయేఽ**
**క్షయే వపుషి తేఽసితే భవతు దృక్త్వదీయేఽమ్మయే.**

జీవులయందు అనుగ్రహముతో ఆవిర్భవించినదానివి. సహ్యాపర్వతం నుంచి ప్రాక్ సముద్రంవరకు సంచరించినదానివి. అట్టి నిన్ను నేను ఆశ్రయించాను తల్లీ! హరిహరాత్మకమైన పరమేశ్వరీ, ఇంద్రనీల మణులువంటి దివ్యకోమల శ్యామలవర్ణం కలదానా. నిన్ను నేను ప్రార్థిస్తున్నాను. నా మనస్సెప్పుడూ దైన్యమును పొందకుండుగాక! నదీ స్వరూపమైన నీయందు నాయొక్క దృష్టి, హృదయము నిలుచుగాక.

## 50

**కాచిత్క్షాలయతి ప్రభోః పదయుగం కాచిత్క మారోహతి**
**స్వేదాత్కాపి జటాదితః ప్రకటితా బద్ధా పరో ద్వాహితా**
**ఉచ్చైః కాచన మానినీహ పతితా జాతా గతా కాప్యధః**
**త్యక్తం తేనచ నామరూపమపి సత్కృష్ణే దశాయామిహ.**

ఒకనది యమునానది, పరిచారికవలె భార్యయై పాదద్వంద్వమును కడుగుతూ ఉంటుంది. శ్రీకృష్ణునికి. ఒకనది అనగా గంగ. పరమశివుని యొక్క ఇల్లాలై ఆయన శిరస్సు మీద కూర్చున్నది. మరొక నది నర్మదానది శంకరునియొక్క చెమటవలన పుట్టినది. మరొకనది గోదావరి. సర్వేశ్వరుడైన శంకరునియొక్క జటాజూటమునుండి బయలుదేరినది. ఇంకొక నది అనగా మందాకిని పరమశివునియొక్క జటాజూటమున బంధింపబడినది. ఇంకొక నది గంగయే రూపాంతరముగా శంతనునకు భార్య అయినది. మరొకనది అనగా రేవానది భీమసేనునికి భార్య అయినది. ఇంకొకనది గంగ, మరొకనది సరస్వతి ఇద్దరూ పోట్లాడుకొని విష్ణులోకంనుంచి భూలోకం మీద పడినవి. ఇంకొక నది. భోగవతి పాతాళలోకం – నాగలోకానికి వెళ్లింది. తల్లీ! నువ్వు ఇట్టి అవస్థలేవీ పొందలేదు కదా. నీ సహజమైన, దేదీప్యమానమైన మేఘశ్యామలవర్ణాన్ని కూడా వదలలేదే. నీ పేరే సంసారతారకమైన పరబ్రహ్మ స్వరూపమైన శ్రీకృష్ణనామం.



## 51

**దేవేద్యై వేదవేద్యే జయజయ భయహృత్త్వంకృపాకృష్టకృష్ణే**
**త్రాహిత్రాహిగ్రహీతృాంస్తవభవహరాభ్యాంసదాసత్యసంధే,**
**భూయోభూయోఽభయోక్తీఃవితరతవతనుర్యేహమోహప్రహర్త్రీ**
**సామేకామేశమేధ్యామనసినయనయోరాదరాదస్తుదత్త.**

దేవతలచేత స్తోత్రములు పొందే వేదవేద్యవు. సర్వభయాలను పోగొట్టే జగన్మాతవు. దయానిధివి. సంసార బంధహారి నీ నామమని నీ సత్యప్రతిజ్ఞను నిలుపు తల్లీ! *'న మే భక్తః ప్రణశ్యతి'* ఇది శ్రీకృష్ణ ప్రతిజ్ఞ. ఆ శ్రీకృష్ణుడే కృష్ణానది యని భావము. నీవు మాకు సర్వదా అభయ ప్రదానమైన వచనాల ననుగ్రహించు. సర్వ భక్తమనోరథములను పూరణచేసే ఓ దత్తాత్రేయ ప్రభో! కృష్ణాతీరమందు సంసారమోహాన్ని హరించే ఏ నీ దివ్యమూర్తి ఉన్నదో ఆ మూర్తి ఆదరపూర్వకముగా నా అంతఃకరణమందు నేత్రముల మధ్యలో నిలుచుగాక. అట్టి నీ సచ్చిదానంద దివ్యమూర్తిని నేత్రములతో చూచి మనస్సుతో ధ్యానించి కృతార్థుడ నగునట్లుగా అనుగ్రహించు.

## 52

**కృష్ణాం యో వృణుతే భక్తః పదం యాయాన్నిరంతరమ్**
**తృష్ణాం యో వృణుతేఽభక్తః భేదం యాయాన్నిరంతరమ్.**
**కృష్ణాస్థప్రేరితమతిః వాసుదేవ సరస్వతీ,**
**కృష్ణామస్తౌత్ తతః ప్రీయాత్ నరసింహసరస్వతీ.**

ఏ భక్తులు స్నానపానాదులకై కృష్ణానదిని కోరుకుంటారో వారు భేదరహితమైన, నిరతిశయమైన, శాశ్వతమైన మోక్షమును పొందగలరు. భక్తిలేనివాడు సంసారతాపత్రయంతో విషయ భోగములయందు ఆశను పొందువాడో, వాడు అంతులేని మహాదుఃఖాన్ని పొందుతాడు. ఈ కృష్ణాస్తోత్రమును కృష్ణాతీరమైన 'కృష్ణా' అను స్థానమందు పరమహంస పరివ్రాజకాచార్యవర్య వాసుదేవానంద సరస్వతీస్వామివారు రచించిరి.

